అక్షర కలం తెలుగు దిన పత్రికలో
పదవి విరమణ, కోర్టు నోటీసులు,
జన్మదిన, వ్యాపార అభివృద్ధి కొరకు
మరియు అన్ని రకాల ప్రకటనలు
ప్రచురించబడును.
సంప్రదించండి
93962 18955
aksharakalam@gmail.com
అక్షరకలం
తెలుగు దినపత్రిక

epaper. aksharakalam. com
# అక్షరకలం
తెలుగు దినపత్రిక
aksharakalam@gmail.com

అక్షరకలం
తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా,జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణుల మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్:
93962 18955

సంపుటి : 17 సంచిక : 309 | 20-12-2025 శనివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00

## ఉద్యోగ నియామకాల్లో
# పారదర్శకతకు
# పెద్దపీట

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

**ఉద్యోగ నియామకాల విషయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నా. 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైంది. ఈ విషయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారు.**

నియామకాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి. ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరం అని రాష్ట్రపతి అన్నారు. నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత పెంచడంపై దృష్టి సారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు.నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే నియామకాల్లో పారదర్శకత, నైతికత అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాలు నేర్పవచ్చుని కానీ సమగ్రత లోపాన్ని మాత్రం భర్తీ చేయలేమన్నారు. టెక్నాలజీ సవాళ్లను ఎదుర్కొనేలా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కమిషన్ చైర్మన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్లు.. ఈ సదస్సుకు హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరీక్షల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, పరస్పర సహకారంపై ఈ సదస్సులో చర్చించనున్నారు.







- సమస్యలపై వేగంగా స్పందించి..చర్యలు తీసుకోవాలి
- వికసిత భారత్ లక్ష్య సాధనలో సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకం
- పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సులో రాష్ట్రపతి ముర్ము

## ఆ ఐదు గ్రామాలను
# తెలంగాణలో కలపండి

- పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలి
- చంద్రబాబుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వినతి
- ప్రసాద్ స్కీంలో భద్రాచలానికి 200 కోట్లు విడుదల చేయండి
- కేంద్రాన్ని కోరిక కవిత



వార్త 2లో



వార్త 2లో

## ఫోన్ ట్యాపింగ్ కేసు..ప్రభాకర్ రావు కస్టోడియల్ పొడిగింపు

## ఐటి ఉద్యోగులే టార్గెట్‌గా
# గంజాయి సరఫరా

### రాయదుర్గలో భారీగా గంజాయి స్వాధీనం

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

రాష్ట్రంలో గంజాయి సరఫరాను అడ్డుకునేందుకు పోలీసులు అనేక రకాలుగా చర్యలు తీసుకుంటున్నారు. గంజాయిని అమ్ముతున్నా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట గంజాయి సరఫరా జరుగుతూ పట్టుబడటం పోలీసులకు సవాల్‌గా మారింది. తాజాగా నగరంలోని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐటీ ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు.. గంజాయి సరఫరా చేస్తున్న సోహెల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని వద్ద నుంచి 17 కేజీల గంజాయి, 2 గ్రాముల ఎండీఎంఏ (ఓఆఓం) డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయి తెచ్చి ఐటీ ఉద్యోగులకు నిందితుడు సోహెల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది.



2

## 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

## శ్రీశైలం పర్యటనలో ఎన్నికల
# ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్

**అమ్రాబాద్ వద్ద స్వాగతించిన కలెక్టర్, ఎస్పీలు**



2 లో..

భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ హైదరాబాద్ చేరుకున్నారు. శ్రీశైలం వెళ్లే క్రమంలో నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ స్వాగతం పలికారు.



2

## పార్లమెంట్ నిరవధిక వాయిదా

చివరిరోజు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండానే ముగింపు

## ఎంపిలకు స్పీకర్ ఓంబిర్లా
# తేనీటి విందు



2

- సరదాగా ముచ్చటించుకున్న సభ్యులు
- హాజరైన ప్రధాని మోడీ, రాజ్‌నాథ్ సింగ్
- ప్రధాని విదేశీ పర్యటనపై ప్రియాంక ఆరా

పార్లమెంటు శీతాకాల సమావేశాలు మూడువారాల పాటు వాడివేడి చర్చలు, వాకౌట్లు, నిరసనల మధ్య ముగిసాయి. ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడటంతో సభలోని వాతావరణాన్ని తేలిక చేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ఉదయం ఎంపీలందరికీ తన నివాసంలో తేనేటి విందు ఇచ్చారు.



# పంచాయితీలకు సెలవ్.. పెట్టండి

- ఎంపిటిసి,జడ్పీటిసిలకు ప్రిపేర్ కండి
- గులాబీ జెండాను హత్తుకున్న ప్రజలు
- ఇక అన్ని ఎన్నికల్లో మనమే గెలవాలి
- గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కెటిఆర్

6 లో..

పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం సులభం కానీ.. పంచాయతీ ఎన్నికల్లో గెలవడం కష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవలేదని.. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో గెలిచిందని తెలిపారు.

# ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపండి











### పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలి

### చంద్రబాబుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వినతి

### ప్రసాద్ స్కీంలో భద్రాచలానికి 200 కోట్లు విడుదల చేయండి

### కేంద్రాన్ని కోరిక కవిత

భద్రాద్రి కొత్తగూడెం, అక్షరకలం ప్రతినిధి

పరిపాలన సౌలభ్యం కోసం ఐదు గ్రామాలను భద్రాచలంలో కలపాలని ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. అలాగే అశ్వరావుపేట పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి చేశారు. ప్రసాద్ స్కీంలో భద్రాచలం రామాలయానికి రెండు వందల కోట్లు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసులు, గిరిజనుల సంక్షేమం కోసం చేసిన ఖర్చులపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క శ్వేతపత్రం విడుదల చేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జాగృతిబాటలో భాగంగా ఆమె జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ పాలనలో ఆదివాసులు, గిరిజనులకు ఏం చేశారో వెల్లడించాలన్నారు. సింగరేణి పుట్టినిల్లు ఇల్లందులో కొత్త బొగ్గు బావులు మొదలు పెట్టాలని అన్నారు. సింగరేణి కార్మికులు సంక్షేమం కోసం కాకుండా సీఎం రేవంత్ ఫుట్ బాల్ కోసం పది కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో కొత్తగూడెంకు ప్రాధాన్యం లేదని విమర్శించారు. ఒక మంత్రి కొత్తగూడెంను దత్తత తీసుకోవాలని.. కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచాలన్నారు. మణుగూరు ఓసీ 2 ప్రైవేటీకరణ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు భద్రాద్రి జిల్లాలో పొలాలకు అందించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రాలో విలీనమైన ఎటపాక పురుషోత్తమ పట్నం, గుండాల, పిచుకులపాడు, కన్నాయిగూడెం గ్రామాలను భద్రాచలంలో కలపాలన్నారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. కొత్తగూడెంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. కొత్తగూడెం బైపాస్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆదివాసులు, గిరిజనులకు రిజర్వేషన్లు ఉన్నాయని వారిని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. సింగరేణి నిర్వాసిత గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..ప్రభాకర్ రావు కస్టోడియల్ పొడిగింపు

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరోవారం రోజుల పాటు పొడిగించింది సుప్రీం కోర్టు. డిసెంబర్ 25 వరకు కస్టోడియల్ విచారణ చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. గురువారం ప్రభాకర్ రావు వారం రోజుల కస్టోడియల్ విచారణ పూర్తి అయిన విషయం తెలిసిందే. అయితే ట్యాపింగ్ కేసులో మరికొన్ని రోజులు విచారణ చేయాలని సుప్రీంకోర్టును సిట్ కోరింది. వారం రోజుల కస్టోడియల్ విచారణ రిపోర్ట్‌ను ఉన్నత న్యాయస్థానానికి సిట్ అందజేసింది. దీంతో ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణను వారం రోజుల పాటు పొడిగింపుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 26న పోలీస్ కస్టడీ నుంచి ప్రభాకర్ రావును విడుదల చేయాలని.. తదుపరి విచారణ వరకు ఎలాంటి వ్యతిరేక చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఇంటి నుంచి ఆహారం తెచ్చుకునేందుకు, అవసరమైన మందులు తీసుకునేందుకు ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. కాగా.. కొత్త సిట్ ఏర్పాటుతో ట్యాపింగ్ కేసు మరింత వేగవంతంగా విచారణ జరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. సీపీ సజ్జనార్‌తో పాటు రామగుండం సీపీ అంబరి కిషోర్ జా కూడా సిట్‌లో ఉన్నారు. గతంలో వెస్ట్ జోన్ డీసీపీగా ఉన్న సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిద్ధిపేట సీపీ విజయ్ కుమార్ కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మాదాపూర్ డీసీపీ రితి రాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డితో పాటు రవీందర్, వెంకట గిరి, కేఎస్ రావు, శ్రీధర్, నాగేందర్ రావుతో కొత్త సిట్ ఏర్పాటు అయ్యింది.

## శ్రీశైలం పర్యటనలో ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్

### అమ్రాబాద్ వద్ద స్వాగతించిన కలెక్టర్, ఎస్పీలు





నాగర్‌కర్నూలు, అక్షరకలం ప్రతినిధి

భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ హైదరాబాద్ చేరుకున్నారు. శ్రీశైలం వెళ్లే క్రమంలో నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ స్వాగతం పలికారు. శుక్రవారం భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ కుటుంబ సమేతంగా కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుండి నేరుగా రోడ్డు మార్గాన శ్రీశైలం దర్శనానికి వెళ్తూ మార్గమధ్యంలో నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూర్ గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ టూరిజం మృగవాణి గెస్ట్ హౌస్ కు చేరుకున్నారు. భారతదేశ ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ కు నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్, నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కాసేపు విరామం తర్వాత నేరుగా శ్రీశైలం దర్శనానికి బయలు దేరి వేళ్ళారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ నిరవధిక వాయిదా

### చివరిరోజు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండానేముగింపు

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

పార్లమెంటు శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. లోక్‌సభ, రాజ్యసభలు రెండూ నిరవధిక వాయిదా పడ్డాయి. ఉక్రవారం ఉదయంలోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే వందేమాతర గీతాలపన అనంతరం స్పీకర్ ఓంబిర్లా సభను నిరవధిక వాయిదా వేశారు. లోక్‌సభకు ప్రధాని నరేంద్రమోడీ కూడా హాజరయ్యారు. ఆయన కూడా వందేమాతర గీతాన్ని పాడారు. అలాగే రాజ్యసభ 11 గంటలకు ప్రారంభమైంది. సభకు ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ హాజరయ్యారు. యధావిధిగానే ఆయన టేబుల్‌పై పత్రాలు, ప్రకటనలు, నివేదిక సంబంధించినవి ఆయన టేబుల్‌మీద ఉన్నాయి. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ సభను నిరవధిక వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నిన్న మంత్రి సమాధానం ఇచ్చే సమయంలో సభలో సభ్యుల ప్రవర్తనపై పునరాలోచించు కోవాలి. నిరసన వ్యక్తం చేయడం, కాగితాలను చింపివేయడం వంటివి సభకు తగనివి. సభ్యులు తమ ప్రవర్తనపై ఆలోచించుకోవాలి అని ఆయన అన్నారు. ఈ సెషన్ చాలా ఉత్పాదకంగా జరిగిందని, రాబోయే సెషన్లలో ఫలవంతమైన చర్చలు జరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయంలో నాణ్యతతో కూడిన చర్చలు చాలా విజయవంతంగా జరిగాయని ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ పార్లీమెంటు సమావేశాల్లో ప్రధానంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికున్న పేరును విబి-జి రామ్ జి బిల్లుగా తెచ్చిన సవరణ బిల్లును ప్రతిపక్ష ఎంపీల ఆందోళనల మధ్యే కేంద్రం ఆమోదింపజేసుకుంది.

## ఎంపిలకు స్పీకర్ ఓంబిర్లా తేనీటి విందు


### సరదాగా ముచ్చటించుకున్న సభ్యులు

### హాజరైన ప్రధాని మోడీ, రాజ్‌నాథ్ సింగ్

### ప్రధాని విదేశీ పర్యటనపై ప్రియాంక ఆరా

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

పార్లమెంటు శీతాకాల సమావేశాలు మూడువారాల పాటు వాడివేడి చర్చలు, వాకౌట్లు, నిరసనల మధ్య ముగిసాయి. ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడటంతో సభలోని వాతావరణాన్ని తేలిక చేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ఉదయం ఎంపీలందరికీ తన నివాసంలో తేనేటి విందు ఇచ్చారు. గత సమావేశాల మాదిరిగా కాకుండా ఈ టీపార్టీకి విపక్ష ఎంపీలు కూడా హాజరయ్యారు. స్నేహపూర్వక వాతావరణంలో సరదా ముచ్చట్లతో సభ్యులంతా సందడిగా గడిపారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ పర్యటనలో ఉండటంతో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా స్పీకర్ ఇచ్చిన టీపార్టీలో పాల్గొన్నారు. విపక్షం తరఫున ప్రాతినిధ్యం వహించారు. 20 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఓం బిర్లా, మోదీతో పాటు రాజ్‌నాథ్ సింగ్ కూర్చుని ఉండగా ఆయన పక్కన ప్రియాంక ఆసీనులయ్యారు. తన నియోజకవర్గం వయనాడ్ నుంచి తెచ్చుకున్న ఒక మూలికను ఎలర్జీ రాకుండా తీసుకుంటూ ఉంటానని ప్రియాంక వివరించారట. మోదీ ఇటీవల జరిపిన ఇథియోపియా, జోర్డాన్, ఒమన్ పర్యటన గురించి ప్రియాంక అడగగా, బాగా జరిగిందని ఆయన బదులిచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్ర యాదవ్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) నేత సుప్రియా సులే, సీపీఐ నేత డి.రాజా కూడా సమావేశం లో పాల్గొన్నారు. శీతాకాల సమావేశాలను మరికొద్ది రోజులు పొడిగించి



ఉండాల్సిందని ధర్మేంద్ర యాదవ్ అభిప్రాయపడగా, ఆయనకు గొంతు నొప్పి రాకుండా ఇక్కడితో ముగించామని మోదీ సరదాగా బదులిచ్చారు. బాగా ప్రిపేర్ అయి సభకు వచ్చారంటూ ఎన్‌కే రామచంద్రన్ తదితర విపక్ష ఎంపీలను పీఎం అభినందించారు. పాత పార్లమెంటు భవనంలో మాదిరిగానే న్యూ పార్లమెంట్ బిల్డింగ్‌లో ఎంపీల కోసం ఒక సెంట్రల్ హాల్ చేర్చాలని పలువురు ఎంపీలు మోదీని కోరారు. సెంట్రల్ హాలులో ఎంపీలు, రిటైర్‌మెంట్ అయిన ఎంపీలు చర్చించుకునే వారు. దీనిపై మోదీ సరదాగా స్పందించారు. అది రిటైర్‌మెంట్ తర్వాత కదా...ఇంకా మీరు చాలా సేవ చేయాల్సి ఉంది.. అని అనడంతో సమావేశంలో నవ్వులు వెల్లివిరిసాయి. విపక్ష పార్టీ సభ్యులను సభలో మాట్లాడేందుకు అనుమతించడం లేదని ఆరోపిస్తూ గత పర్యాయం స్పీకర్ టీ పార్టీని రాహుల్, ఇతర విపక్ష నేతలు బాయ్‌కాట్ చేశారు. అయితే ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విపక్షాల విషయంలోనూ స్పీకర్ సముచితంగా వ్యవహరించారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అభిప్రాయ పడ్డారని, స్పీకర్ టీపార్టీకి విపక్ష ఎంపీలంతా తప్పనిసరిగా హాజరుకావాలనే నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.

## 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

### డిజిపి శివధర్ ఎదుట లొంగిన నక్సల్స్

### లొంగిన వారిలో రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి

### కామారెడ్డికి చెందిన వ్యక్తిగా గుర్తింపు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

నిషేధిత మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 41 మంది మావోయిస్టు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో బటాలియన్, వివిధ డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు కూడా ఉన్నారు. మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇద్దరు తెలంగాణ వాళ్లు ఉండటం గమనార్హం. పోలీసుల వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్/కంపెనీ స్థాయి కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా/ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు. ఇన్సాస్ ఎల్ఎంజీ, ఏకే47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లు, .303 రైఫిళ్లు తదితర ఆయుధాలు లొంగుబాటులో భాగంగా అప్పగించారు. మావోయిస్టు పార్టీలో సంస్థాగత బలహీనత, నాయకత్వంపై నమ్మకం తగ్గడం, అడవుల్లో తీవ్ర జీవన కష్టాలు, భద్రతా బలగాల ఒత్తిడి కారణంగానే తాము ప్రధాన జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు లొంగిపోయిన మావోయిస్టులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర పునరావాస విధానం ప్రకారం డివిజనల్ కమిటీ సభ్యులకు రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. ఆయుధాలపై అదనపు రివార్డు కూడా ఇవ్వనున్నారు. మొత్తంగా రూ.1.46 కోట్లకు పైగా నగదు ప్రోత్సాహకాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లొంగుబాటుతో తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు మరింత బలహీనపడతాయని, మిగిలిన అజ్ఞాత కేడర్లు కూడా హింసను వీడి జనజీవనంలోకి రావాలని పోలీసులు పిలుపునిచ్చారు.నక్సలిజాన్ని రూపుమాపేందుకు, మావోయిస్టులను ఏరివేసేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎంతోమంది మావోలు భద్రతబలగాల ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. మరికొందరు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ క్రమంలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 40 మంది మావోయిస్టులు లొంగిపోయారు. డీజీపీ సమక్షంలో జనజీవన స్రవంతిలో మావోయిస్టులు కలిసిపోయారు..



లొంగిపోయిన వాళ్లలో ముగ్గురు రాష్ట్రస్థాయి లీడర్లు.. కొందరు హిడ్మా బెటాలియన్ కమాండర్స్ ఉన్నారు. లొంగిపోయిన వారిలో కామారెడ్డికి చెందిన రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు డివిజన్ కమిటీ సభ్యులు, ఇద్దరు తెలంగాణ వాసులు ఉన్నారు. మిగతా మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారిగా డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టుల వద్ద నుంచి 24 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు సెంట్రల్ విజన్ కమాండర్లు ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. తెలంగాణ పోలీసుల మేజర్ ఆపరేషన్ సక్సెస్ తో మావోయిస్ట్ పార్టీ కి మరో ఎదురు దెబ్బ తగిలిన్లైంది.

# కార్మిక చట్టాలను తుంగలో తొక్కడం దారుణం

## కొత్త చట్టాలతో కార్మికుల హక్కులకు భంగం

### కేంద్రం తీరుపై మండిపడ్డ లెఫ్ట్ నేతలు

**విజయవాడ,**

కార్మిక చట్టాల రద్దు గురించి పార్లమెంటులో చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుపట్టినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని లెఫ్ట్ నేతలు మండిపడ్డారు. ఈ కోడ్‌ల ప్రకారం దేశంలోని 70 శాతం పరిశ్రమల్లోని 74 శాతం కార్మికులకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకుండా పోతున్నాయి. ప్రజా సంక్షేమ చట్టాలను రద్దు చేస్తూ కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలను నివారించగలిగే స్థితి రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన పార్టీలకు వుంది. ఈ పార్టీలు మద్దతు ఇవ్వకపోతే కేంద్ర







ప్రభుత్వం మనుగడ కోల్పోతుంది. మన రాష్ట్రంలోని గ్రామీణ కూలీలకు, మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు తోడ్పడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కుదించి రాష్ట్రంపై భారం వేస్తున్న బిల్లును బలపరచి ఆర్థిక భారం రాష్ట్రంపై వేయవద్దని టిడిపి ఎంపీ కోరడం విడ్డూరంగా వుంది. చట్టబద్ధంగా రాష్ట్రానికి రావలసిన నిధులే ఇవ్వని కేంద్రం ఈ విజ్ఞప్తులకు, విన్నపాలకు స్పందిస్తుందా అని అన్నారు. స్వదేశీ నినాదంతో అధికారంలోకి వచ్చిన బిజెపి ఏలుబడిలో బ్రిటిష్ కాలం నాటి 12 గంటల పని విధానాన్ని అమలులోకి తెచ్చింది. కార్మికుల జన్మహక్కుగా వున్న సమ్మె హక్కు ప్రమాదంలో పడింది. గతంలో జర్మనీ, ఇటలీ దేశాల్లో ఫాసిస్టు పాలకులు చేసిన మొదటి పని కార్మిక సంఘాలను నిషేధించడం, వారి చట్టబద్ధ హక్కులను కాలరాయడం. నేడు దేశంలో అదే తరహా విధానాలు అమలవుతున్నాయని సిపిఎం నేతలు మధు, గఫూర్‌లో వేర్వేరుగా అభిప్రాయపడ్డారు. 2005లో ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ వ్యవసాయ కూలీలకు పనిని హక్కుగా ఇచ్చింది. ఆ హక్కును తొలగించి, రాష్ట్రాలపై నిధుల భారం వేస్తూ వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (విబి-జి ఆర్‌ఎమ్ జి) బిల్లును ఆమోదించుకున్నారు. వారి మతతత్వ ఎజెండాకు అనుగుణంగానే పాత చట్టంలోని మహాత్మా గాంధీ పేరును తొలగించి 'రామ్' వచ్చేలా పేరు పెట్టారని మండిపడ్డారు. గత ఐదు సంవత్సరాలుగా ఉపాధి చట్టానికి కేంద్రం నిధులు తగ్గిస్తూ వచ్చింది. ఈ చట్టంలో అవినీతి జరుగుతుందని, వ్యవసాయ సమస్యలకు కారణమని, ఉచిత పథకాలు ఎంత కాలమని బిజెపి నేతలు, వారి అనుంగ మీడియా చాలా కాలంగా చేస్తున్న ప్రచారానికి తగ్గట్టుగానే కొత్త బిల్లును తెచ్చారని మండిపడ్డారు. 12.16 కోట్ల మంది గ్రామీణ పేదలకు ఇచ్చే ఈ అతికొద్ది మొత్తమే అవినీతి, అక్రమం అయితే మోడీ 11 సంవత్సరాల పాలనలో కార్పొరేట్ కంపెనీలకు రూ.17.2 లక్షల కోట్ల రుణాలను రద్దు చేయడాన్ని ఏమనాలని నిలదీశారు. ఇదికాక బ్యాంకుల్లో తీసుకున్న మరో 10 లక్షల కోట్లు చెల్లించకుండా మొండి బకాయిలుగా మార్చి బ్యాంకులను దివాళా తీయించడాన్ని ఏమనాలన్నారు. ప్రభుత్వ రంగంలో బీమా కంపెనీలు ఉండడం వల్ల ప్రజల సొమ్ముకు, దేశ ఆర్థికవ్యవస్థకు భద్రత వుంటుందని 1956లో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను జాతీయం చేశారు. అదే సంవత్సరం సెప్టెంబర్ 1న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ప్రభుత్వ రంగంలో




ఏర్పడింది. 98 శాతం క్లెయిమ్‌లను సకాలంలో అమలు చేసి ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మకమైన బీమా కంపెనీగా ఎల్ఐసి అభివృద్ధి చెందింది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా వుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.54.52 లక్షల కోట్ల విలువైన ఆస్తులు కలిగిఉంది. ఈ రంగాన్ని కబ్జా చేయాలని చాలా కాలంగా దేశ, విదేశీ బీమా కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. ఈ రంగంలో 50 శాతం లోపు మాత్రమే ప్రైవేట్ పెట్టుబడులు వుండాలనే నిబంధనను క్రమంగా సవరిస్తూ 74 శాతానికి పెంచారు. ఇప్పుడు ఏకంగా 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతిస్తూ మోడీ ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పాస్ చేసుకుంది. ఈ నిర్ణయం పాలసీదారుల వ్యక్తిగత గోప్యతకు, దేశ ఆర్థిక భద్రతకు అత్యంత ప్రమాదం అని వారు అభిప్రాయపడ్డారు.

# ఉపాధి హామీ పథకం సవరణలకు నిరసన

## రాష్ట్రవ్యాప్తంగా లెఫ్ట్ కార్మిక సంఘాల ఆందోళన

### ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతామన్న సిపిఎం

**అమరావతి/విశాఖపట్టణం,**

ఉపాధి హామీ పథకం సవరణలకు వ్యతిరేకంగా. వామపక్షాలు, కార్మిక, వ్యవసాయ, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రంలో పలుచోట్ల నిరసనలు నిర్వహించారు. ఉపాధి హామీ పథకం సవరణలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం సాగిస్తామని



సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించే వరకు పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం విశాఖపట్నం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గాంధీజీ విగ్రహానికి సిపిఎం నాయకులు వి.శ్రీనివాసరావు, కె.లోకనాథం, సిహెచ్ నర్సింగరావు, ఎం.జగ్గు నాయుడు, తదితరులు కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ ?. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలను రద్దు చేయాలన్నారు. చట్టబద్ధ హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. యుపిఎ ప్రభుత్వంపై వామపక్షాలు తీసుకువచ్చిన ఒత్తిడి ఫలితంగా రూపుదిద్దుకున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం మౌలిక స్వభావాన్ని కేంద్ర ప్రభుత్వం మారుస్తోందన్నారు. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి రాం జి) పేరుతో ఉపాధి హామీ పథకానికి 'రాంరాం' పలకనుందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా పని హక్కుగా ఉన్న పాతచట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారని తెలిపారు. సాధారణ పథకంగా దీనిని మారిస్తే, ఈ పథకం కొనసాగవచ్చు లేదా రద్దు చేయవచ్చు అన్నారు. ఇప్పటివరకు వ్యవసాయ కార్మికుల డిమాండ్ ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్నిమార్చేసి అవసరాన్ని (సప్లయిని బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. కొత్త పథకంలో పనిదినాలు 100 నుండి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకేనన్నారు. వ్యవసాయ పనులు రద్దీగా ఉండే సమయాల్లో 60 రోజుల ఉపాధిని నిలుపుదల చేయడం వల్ల అత్యంత అవసరమైన సమయాల్లో గ్రామీణ కార్మికులకు పని నిరాకరించబడుతోందని వివరించారు. తద్వారా వారిని కొద్దిమందిగా ఉండే భూస్వాములపై ఆధారపడేలా చేయడం గర్హనీయ మన్నారు. యంజిఎస్ఆర్ ఈజిఎగా ఉన్న ఈ పథకం పేరును మార్చడం మహాత్ముడిని అవమానించడమే నన్నారు. ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని చెప్పారు. అంతేకాకుండా మరోవైపు 10 నుండి 40 శాతానికి రాష్ట్రాలపై భారం పెంచారని వివరించారు. ఈ పథకం అమలుకు ఇప్పటివరకు కేంద్రం ఇస్తున్న 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై వేల కోట్ల అదనపు భారం వేస్తున్నారని తెలిపారు. కొత్త పథకం ప్రకారం అందుకే ఖర్చును ముందుగా రాష్ట్రాలు భరించాల్సి ఉంటుందన్నారు. ఆ తర్వాత కేంద్రం తిరిగి ఆ సొమ్మును రాష్ట్రాలకు చెల్లిస్తామని చెబుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రాముడు పేరుతో పథకం పెట్టాలని భావిస్తే పట్టణ పేదల ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టి దానికి ఆ పేరు పెట్టుకోవచ్చునన్నారు. గ్రామీణీలకు మేలు చేసే పథకం పేరులో గాంధీ పేరుని తొలగించడం మాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, ఉత్తరాంధ్ర జిల్లాల పట్టబద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త కొత్త ఎత్తులతో సైబర్ మోసాలు

## న్యూ ఇయర్ గిఫ్ట్, క్రిస్మస్ గిఫ్ట్ లింక్‌లను క్లిక్ చేయవద్దు

### అప్రమత్తంగా ఉండకుంటే అంతే సంగతులు

### హెచ్చరించిన సైబర్ పోలీసులు

**హైదరాబాద్,**

క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు చేసే మోసాల బారిన పడవద్దని పోలీసులు హెచ్చరించారు. ఎప్పటికప్పుడు మారుతున్న సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు వారి నేర విధానాన్ని మార్చుకుంటూ ప్రజలను మోసం చేయడానికి కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని ప్రజలను హెచ్చరించారు. పండుగ సీజన్ ప్రారంభమైన వెంటనే ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్ ఫారమ్‌లలో విపరీతమైన విక్రయాలు ప్రారంభమవుతాయని కొంత మందికి క్రిస్మస్ గిఫ్ట్ అంటూ, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ వాట్సాప్ లేదా ఇమెయిల్‌లో సందేశాలతో లింక్ లు వస్తుంటాయని, ఆ లింక్ లను క్లిక్ చేసి మోసపోవద్దని, చిన్నగా 500 డాలర్లు గిఫ్ట్ కార్డ్‌ను గెలుచుకోండి అని మెసేజ్‌లు వస్తుంటాయని, ఆ లింక్ లపై క్లిక్ చేసిన తర్వాత దానితో ఓ లింక్ కూడా ఉంటుందని, దీనికి ఇచ్చే కాప్షన్ కూడా మిమ్ములను ఆ లింక్ క్లిక్ చేసే విధంగా పురిగొల్పుతుందన్నారు. కాబట్టి ఎలాంటి పరిస్థితిలలోను అపరిచితుల నుంచి వచ్చిన లింక్ లపై క్లిక్ చేయవద్దని, మీ వ్యక్తిగత సమాచారం పాన్‌కార్డు నంబర్, పాన్‌కార్డ్ ఫోటోలు అపరిచిత లింక్ లలో పంచుకోవద్దు అని సూచించారు. ఒకవేళ ఆ లింక్‌లో వివరాలు ఇస్తే మీ వ్యక్తిగత వివరాలు మీ ఫోన్ నంబర్ ఆధారంగా మీ బ్యాంక్ ఎకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ అవుతాయని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే సంబంధిత మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు, మీ దగ్గర లోని పోలీసు స్టేషన్ నంబర్ కు గాని కాల్ చేయాలని, లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.




# 29 నుండి జనవరి 2వ తేదీ వరకు

## కపిలేశ్వరాలయంలో తెప్పోత్సవాలు

**తిరుపతి,**

తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో డిసెంబరు 29 నుండి జనవరి 2వ తేదీ వరకు తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఐదు రోజులపాటు జరిగే తెప్పోత్సవాల లో మొదటిరోజైన డిసెంబరు 29వ తేదీన శ్రీ వినాయక స్వామివారు, శ్రీ చంద్రశేఖర్ స్వామివారు పుష్కరిణిలో 9 చుట్లు విహరిస్తారు. నవంబరు 30న శ్రీ వళ్ళి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామివారు 9 చుట్లు, డిసెంబరు 31న శ్రీ సోమస్కందస్వామివారు 9 చుట్లు, జనవరి 1న శ్రీ కామాక్షి అమ్మవారు 9 చుట్లు, జనవరి 2న శ్రీ చండికేశ్వరస్వామివారు మరియు శ్రీ చంద్రశేఖర స్వామివారు తెప్పలపై 9 చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు ఊంజల సేవ, తెప్పోత్సవాలు నిర్వహిస్తారు.జనవరి 3వ తేదీన ఆరుద్ర దర్శన మహోత్సవం సందర్భంగా ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు శ్రీ నటరాజస్వామివారు, శ్రీ శివగామి అమ్మవారు, శ్రీ మాణిక్యవాసగ స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగించనున్నారు. తెప్పోత్సవాల సందర్భంగా టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంకీర్తనలు ఆలపిస్తారు.

# ఢిల్లీ కాలుష్యంపై మరోమారు సుప్రీం సీరియస్

## టోల్ ప్లాజాలు మూసేయాలని ఆదేశం

**న్యూఢిల్లీ,**

:దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యం ముప్పు తిప్పలు పెడుతోంది. స్వచ్ఛమైన గాలి లేక నరకయాతన పడుతున్నారు. బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. నగర వాసులు ఆందోళనలు చేపడుతున్నారు. ఇంకోవైపు పార్లమెంట్ వేదికగా విపక్ష నాయకులు కూడా పోరాటం చేస్తున్నారు. అయినా కూడా సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. తాజాగా ఈ వ్యవహారంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం కూడా సీరియస్ అయింది. కాలుష్యాన్ని నియంత్రించడానికి అధికారులు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు పూర్తిగా విఫలమయ్యాయంటూ మందలించింది. టోల్ ప్లాజాల దగ్గర ట్రాఫిక్ రద్దీ, పెరుగుతున్న వాయు కాలుష్యానికి తీవ్రమైన ఆందోళన కలిగించే అంశాలుగా పేర్కొంది. తక్షణమే టోల్ ప్లాజాలను మూసేయాలని ఆదేశించింది. తాత్కాలిక నష్టాలను పౌర సంస్థతో భర్తీ చేసుకోవచ్చని సూచించింది. కాలుష్య నియంత్రణ కోసం తాత్కాలిక లేదా స్వల్ప కాలిక చర్యలు కాకుండా దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం అని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీ ప్రభుత్వం పాఠశాలలను మూసివేయడం, ఆన్‌లైన్ తరగతులను అనుమతించడంపై సవాళ్లు సహా పిల్లలపై కాలుష్యం ప్రభావంపై దాఖలైన పిటిషన్లను విచారించిన కోర్టు.. జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఇటువంటి చర్యలు తాత్కాలిక ఉపశమనం కల్పించడానికి ఉద్దేశించిన మధ్యంతర విధాన నిర్ణయాలు అని పేర్కొంది. శీతాకాలంలో పాఠశాలలు 10 నుంచి 15 రోజులు మూసివేయబడతాయని ధర్మాసనం తెలిపింది. ఏ కారణంతోనైనా ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీ ప్రభుత్వం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి మాట్లాడుతూ.. పాత వాహనాలు కాలుష్య స్థాయిలను మరింత దిగజారుస్తున్నాయని తెలిపారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్‌లు

**విజయనగరం**

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లాలోని గంట్యాడ మండలంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా దర్బార్‌లో సామాన్య ప్రజల నుంచి వస్తున్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అన్నారు. అధికార యంత్రాంగం సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. ప్రజల దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహించటం జరుగుతుందని స్పష్టం చేశారు.

# చంద్రబాబుకు మరో అరుదైన గౌరవం

## బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు

### పురస్కారాన్ని ప్రకటించిన ఎకనమిక్ టైమ్స్

### అభినందించిన డిప్యూటి సిఎం పవన్ తదితరులు

**అమరావతి,**

ఏపీ సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ 'ఎకనమిక్ టైమ్స్' ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్'లో వెల్లడించారు. 'చంద్రబాబుకు ఈ అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణం. రాష్ట్రంతో పాటు మా కుటుంబానికి ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకం. సంస్కరణలను చంద్రబాబు ధైర్యంగా ముందుకు తీసుకెళ్లారని జ్యూరీ ప్రశంసించింది. పాలనలో సంస్కరణలు, వేగం, విశ్వాసంపై చూపిన నిబద్ధతకి ఈ అవార్డు నిదర్శనం. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు నాయకత్వం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోంది. పెట్టుబడుల ఆకర్షణ, సంస్కరణాత్మక పాలనకు సీఎం స్ఫూర్తిగా నిలుస్తున్నదని లోకేశ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే సీఎం చంద్రబాబుకి ఎకనమిక్ టైమ్స్ సంస్థ 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారాన్ని ప్రకటించడం సంతోషదాయకమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు నాయకత్వ శైలి ఎంతో స్ఫూర్తినిస్తుంది. రాష్ట్రాభివృద్ధి కోసం, నవతరం భవిష్యత్తు కోసం ఆయన అమలు చేస్తున్న పాలనా విధానాలు, పారిశ్రామికవృద్ధికి చేపడుతున్న సంస్కరణలు కచ్చితంగా సత్ఫలితాలనిస్తాయి. ఆయనకు దక్కిన ఈ అవార్డు రాష్ట్రమంతటికీ గర్వ కారణంగా భావిస్తున్నాను. ఈ పురస్కారం ద్వారా రాష్ట్రానికి ఒక బ్రాండ్ ఇమేజ్ వస్తుందని పవన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాల అమలు, పారిశ్రామిక సంస్కరణలు, రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నందుకు గానూ.. 'బిజినెస్ రీ ఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ముఖ్యమంత్రి చంద్రబాబును వరించింది. మార్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఈ అవార్డును చంద్రబాబుకు ప్రదానం చేయనున్నారు. ముఖ్యమంత్రికి అవార్డు రావడం పట్ల మంత్రులు, అధికారుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ అవార్డు తనకు లభించడంపట్ల సహచర మంత్రులు, అధికారులు, కలెక్టర్ల సమష్టి కృషి అని సీఎం చంద్రబాబు అన్నారు.

# వార్డు మెంబర్‌గా గెలిచిన ట్రాన్స్ జెండర్

**నాగర్‌కర్నూల్,**

ట్రాన్స్ జెండర్ అంటే.. గృహప్రవేశాలు, శుభకార్యాలలో, రోడ్లపై వాహనాలు ఆపి డబ్బులు వసూలు చేస్తారని అంతా భావిస్తారు. కానీ, తాము ప్రజా సేవలోనూ ముందుంటామని ఈ ట్రాన్స్‌జెండర్ నిరూపిస్తున్నారు. పంచాయితీ ఎన్నికల్లో నిలవడమే కాకుండా.. జయకేతనం ఎగురవేశారు.నాగర్ కర్నూల్ జిల్లా చారగొండ మండలంలో మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా చారకొండ గ్రామపంచాయతీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 11వ వార్డు అభ్యర్థిగా పోటీ చేసిన ట్రాన్స్ జెండర్ నందిని ఎన్నికయ్యారు. ఈ పంచాయతీలో 12 వార్డులకు గాను 11వ వార్డుకు ఎస్సీ జర్నరల్ కేటాయించారు. ఈ వార్డు నుంచి కాంగ్రెస్ మద్దతుతో నందిని, బీఆర్ఎస్ నుంచి పెద్దాపూర్ వెంకటయ్య, బీఎస్పీ నుంచి మల్లేష్ పోటీ పడ్డారు. ఈ వార్డులో మొత్తం 372 ఓటర్లు ఉన్నారు. బుధవారం వెల్లడైన ఫలితాలలో నందిని.. బీఆర్ఎస్ అభ్యర్థిపై 64 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆమె గెలుపుపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నందిని.. ట్రాన్స్‌జెండర్ మహిళలు ఓన్లీ నూతన గృహప్రవేశాలప్పుడు, శుభకార్యాలలో డబ్బులు వసూలు చేస్తారనే భావన ప్రజల్లో ఉంటుంది. కానీ, డబ్బులు వసూళ్లకే పరిమితం కాకుండా అన్నిట్లో మేమున్నామని చాటిచెప్పాలనే తన లక్ష్యమన్నారు. తనను ఆదర్శంగా తీసుకొని ట్రాన్స్‌జెండర్ మహిళలు అన్నింట్లోనూ ముందుండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నా సేవలు గుర్తించి అవకాశం కల్పించిందని.. తనను గెలిపించిన గ్రామ ప్రజలకు నందిని కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన గ్రామ ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ.. గ్రామ అభివృద్ధి కోసం తోడ్పడతానన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# ఆ పదిమందిని బిఆర్ఎస్ ఆహ్వానించాలి !

ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం అన్నది అనైతికమని అందరూ అనుకుంటున్నా..కాదని తేలిపోయింది. ఎవరు ఎటుపోయినా కిమ్మనకుండా ఉంటే మంచిది. దీనికోసం కోర్టులు, విచారణలు అవసరం లేదని తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపులు స్పష్టం చేశాయి. నిజానికి ఫిరాయింపులకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కాకపోతే దానికి రకరకాల పేర్లు పెట్టి పిలిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిఆర్ఎస్ అధినేతగా ఉన్న కెసిఆర్ ఆనాడు నిర్లజ్జగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలను అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయించారు. జర్మనీ పౌరసత్వం ఉన్న చెన్నమనేని రమేశ్‌ను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేసి కథ నడిపించారు. ఇవన్నీ అనైతికమైతే... పదిమంది పార్టీ మారడం కూడా అనైతికం అవుతుంది. లేదంటే చెల్లుకు చెల్లు అని సరిపెట్టుకోవాల్సిందే. ఇక ఎలాటూ ఆ పదిమంది తాము బిఆర్ఎస్‌లోనే ఉంటున్నామని చెప్పడం ద్వారా వారికి తిరిగి గులాబీ కండువా కప్పి తెలంగాణ భవన్‌లో సన్మానించాలి. ఇవన్నీ మరచి ఇప్పుడు తమ పార్టీకి చెందిన వారు కాంగ్రెస్‌లో చేరితే గగ్గోలు పెట్టారు. సుప్రీం తీర్పు, తరవాత స్పీకర్ తీర్పు దరిమిలా సమాజంలో పెద్దగా మార్పు కనిపించదు. ఎందుకంటే నైతికతకు తావులేని చోట తీర్పులు ఇలాగే ఉంటాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఇప్పుడు ఫిరాయింపులపై తేలిందంతే. ఎమ్మెల్యేలంతా తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారు. స్పీకర్ కూడా అదే చెప్పారు. కనుక ఈ పదిమంది ఎమ్మెల్యేలను స్వాగతించి, ప్రచారం చేసుకోవడం ద్వారా బిఆర్ఎస్ చతురత ప్రదర్శించాలి. ఆ పదిమందిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలి. అప్పుడు వారి రంగు తెలుస్తుంది. ఇకపోతే రాజ్యాంగానికి అన్యాయం జరిగిందంటూ. ఓట్ చోరీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనుంచి ఈ రకమైన అరుపులు మానేయాలి. రాజ్యాంగం ప్రకారం ముందు వారు నడవడం నేర్చుకోవాలి. రాహుల్ పార్లమెంట్‌లో ఒకమాట బయట మరోమాట మాట్లాడడం మానాలి. నీతిమాలిన రాజకీయాలను పక్కన పెట్టాలి . హర్యానాలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రయోగించి వెంటనే వారిపై అనర్హత వేటు వేయాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఫిరాయింపు చట్ట ప్రయోగానికి సాంకేతికత కంటే నైతికతే ప్రామాణికమని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు సూచించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ రక్షకుడిని తానే అన్నంతగా రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని రాష్ట్రాలు తిరుగుతూ ఫొటోలకు పోజులిస్తుంటారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందని అంటున్నారు. ఒక్క మోడీయే కాదు..దేశమంతా ఇలాగే తగులబడింది. అధికారానికి అలవాటు పడ్డ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా చేయలేవు. రాజ్యాంగ రక్షణ విషయంలో దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సాంకేతిక కారణాలను చూపుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గోడ దూకినట్టు నిర్ధారించేందుకు తగినన్ని భౌతిక ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు బిఆర్ఎస్ కూడా నైతికత ప్రదర్శించాలి. ఈ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువా కప్పాలి. అప్పుడు వారు వస్తారా లేదా అన్నది వారి ఇష్టం లేదంటే బిఆర్ఎస్‌లోనే మరో గ్రూపుగా అయినా ఉండిపోతారు. నిజానికి గతంలో వేములవాడ ఎమ్మెల్యే విషయంలో బిఆర్ఎస్ కూడా అనైతికతకు పాల్పడింది. ఆయనకు జర్మనీ పౌరసత్వం ఉందని తెలిసినా కులగజ్జితో ఎమ్మెల్యేను చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సకల సౌఖ్యాలు అనుభవించారు. దీనిపై ఆనాడు ఫిర్యాదు వచ్చిన వెంటనే కెసిఆర్ స్పందించలేదు. ఈ వ్యవహారం కోర్టుల్లో తేలడానికి పదేళ్లు పట్టింది. అందుకే పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై వాదించే అధికారం బిఆర్ఎస్ నైతికంగా కోల్పోయింది. రాజకీయాల్లో కఠిన చట్టాలను తుంగలో తొక్కుతున్నదే ప్రజాప్రతినిధులు అన్నది మరచిపోరాదు. ఫిరాయింపులపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపుదారులను విచారించి వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యాన్ని ఆక్షేపించారు. స్పీకర్ సాగదీత ధోరణిపై సుప్రీంకోర్టు ధర్మాసనం పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఫిరాయింపుపై మూడు నెలల్లో తేల్చాలని తొలుత జూలై 31న ఆదేశించింది. అక్టోబర్ 21తో గడువు ముగిసినా తేల్చక పోవడంపై కోర్టు సీరియస్ అయ్యింది. నవంబర్ 17న మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ కోర్టు ధికరణకు పాల్పడ్డారని సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలని, లేదా నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకోవాలను కుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నిజానికి సుప్రీం కనుక తన తీర్పును స్పీకర్ కోర్టులోకి నెట్టకుండా నేరుగా నిర్ణయం తీసుకుని తీర్పు ఇచ్చివుంటే పరిస్థితి మరోలా ఉండేది. పక్కా అఫిడవిట్లు, ఫొటోలు, బహిరంగ ప్రకటనలు, సోషల్



మీడియా పోస్టులు, అనేక నెలలుగా కాంగ్రెస్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని స్పష్టంగా నివేదించినా అవేవీ పరిగణనలోకి తీసుకోకుండా స్పీకర్ సాంకేతికంగా ఇప్పటికీ బీఆర్ఎస్‌తోనే ఉన్నారని పేర్కొనడంపై పెద్దగా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో వెలువడిన నిర్ణయం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. తమకు మాత్రం వ్యతిరేకమైన సందర్భాల్లో మాత్రమే స్పందించడం కాదు...ఎప్పుడూ ఒకేలా ఉండాలి. దీనికి భిన్నంగా ఏదో జరుగుతుందని కూడా ఎవరూ అనుకోవద్దు. ప్రజాజీవితంలో నైతిక విలువలు పూర్తిగా లుప్తమైన స్థితిలో ఇలాంటి అనైతికత ఓడుతుందని నైతికత గెలుస్తుందనీ ఎదురుచూడటం అత్యాశే అవుతుంది.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



వలిగొండ అక్షరకలం

వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన బండారు వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందగా దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు 5 వేల రూపాయలు ఆర్థిక సాయం యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వాకిటి అనంత రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమం లో గ్రామసర్పంచ్ సుక్క ముత్యాలు, గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ, వార్డ్ మెంబెర్లు రేఖ మచ్చగిరి, వేముల అనిల్ కుమార్, నాయకులు కోడితల కరుణాకర్, కొప్పుల బాలరాజు, బండారు నరసింహ రెడ్డి, దామెర అంజయ్య, పోలేపక నరసింహ, కసారబోయిన నరసింహ, రెబ్బాస్ నరేష్, పులగల్ల వెంకటయ్య, చిలకమర్రి శ్రీను, పిట్టల సుధాకర్, పందిరి సంపత్, కొప్పుల మధు, షరీఫ్, బోలుగుల రాజు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## యువత రాజకీయ చరిత్రను మార్చాలి : సంజయ్ దాస్ గౌడ్



అక్షర కలం : చిట్యాల యువత ఎన్నికలలో పాల్గొని ప్రస్తుత రాజకీయాలను మార్చాలని మలిదశ ఉద్యమకారుడు సంజయ్ దాస్ గౌడ్ అన్నారు ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని నేరడ గ్రామం లో స్వతంత్ర సర్పంచి అభ్యర్థిగా పోటీ చేసి 830 ఓట్లు సాధించిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు వీరమల్ల అరుణ్ కుమార్ ను తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కూనూరు సంజయ్ దాస్ గౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా సంజయ్ దాస్ గౌడ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు యువకుడు విరమల్ల అరుణ్ కుమార్ పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ఒక్క రూపాయి ఖర్చు చేయకుండ, పంపిణీ చేయకుండ, మద్యం పంపిణీ చేయకుండ 830 ఓట్లు సాధించి రెండో స్థానంలో ఉండటం నేటి యువతకు ఆదర్శం నిలిచాడని అన్నారు. భవిష్యత్తులో ఎటువంటి ఎన్నికలు వచ్చిన అరుణ్ కుమార్ కు ఖచ్చితమైన మద్దతు తెలుపుతామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు జోగు లింగస్వామి, వెల్దుర్తి రాజు, మణికంఠ, మచి పాల్గొన్నారు.

### సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏరియా స్థాయి వెల్ బేబీ షో



మందమర్రి డిసెంబర్ 19 అక్షర కలం ప్రతినిధి:-సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 20వ, తేదీ శనివారం రోజు ఏరియా స్థాయి వెల్ బేబీ షో మందమర్రిలోని కేకే- డిస్పెన్సరీ లో నిర్వహిస్తున్నామని, మందమర్రి ఏరియా డీజీఎం పర్సనల్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మందమర్రి ఏరియా లోని సింగరేణి కార్మికుల పిల్లలు 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలు ఇందులో పాల్గొనేందుకు అర్హులు. పాల్గొనదల్చిన వారు శనివారం రోజు 10 గంటల లోపు పేర్లను డిస్పెన్సరీ లో నమోదు చేసుకోవాలి. నమోదు కోసం వయసు ధ్రువీకరణ, వాక్సీన్ కార్డు చూపించాలి. 20 వ, తేదీ ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

## ఢిల్లీ ఇండియన్ హాబిటాట్ సెంటర్‌లో ఎఫ్‌సీసీఐ అంతర్జాతీయ కాన్ఫరెన్స్

ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

నెదర్లాండ్స్ ఎన్ఆర్ఐలకు తెలంగాణలో పెట్టుబడులు పిలుపు

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 19:ఢిల్లీలోని ఇండియన్ హాబిటాట్ సెంటర్‌లో నెదర్లాండ్స్‌లో స్థాపితమైన ఫౌండేషన్ ఫర్ క్రిటికల్ ఛాయిసెస్ ఫర్ ఇండియా (ఎఫ్ సిసిసిఐ) ఆధ్వర్యంలో రెండు రోజులు జరగనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి




పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన పెద్ద సంఖ్యలో భారత దయస్పోరా పాల్గొనగా, ఇండియా దయస్పోరా: డెడికేటెడ్ టు ది ప్రోగ్రెస్ ఆఫ్ ఇండియా అనే అంశంపై జరిగిన సమావేశంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రసంగించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ, భవిష్యత్ పెట్టుబడుల రంగంలో భారత్‌దేనని స్పష్టం చేశారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక, వాణిజ్య, నూతన సాంకేతిక రంగాల్లో పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందన్నారు. వికసిత్ భారత్ ? 2047 రోడ్‌మ్యాప్ ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని, ఈ దిశగా తెలంగాణ రైజింగ్ సమ్మిట్ ఇన్వెస్టర్లను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. నెదర్లాండ్స్, భారత్ మధ్య బంధాలు విడదీయలేనివని అన్నారు. అ ప్రాంతంలో పారిశ్రామిక విప్లవాన్ని సృష్టిస్తున్న ఎఫ్‌సీసీఐ సభ్యుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఎఫ్‌సీసీఐ ద్వారా దేశ అభివృద్ధికి, దేశ రుణాన్ని తగ్గించే దిశగా చేపడుతున్న కార్యక్రమాలు గర్వకారణమన్నారు దేశంలో కాలుష్యం, పర్యావరణ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణహిత ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ సంస్థ పర్యావరణ హితమైన బిల్డింగ్ మెటీరియల్, రూఫ్ సొల్యూషన్స్, సోలార్ రంగంలో అద్భుతాలు సృష్టిస్తోందని, సోలార్ టైల్స్ కు యూఎస్ పేటెంట్ లభించటం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఎఫ్‌సీసీఐ అధ్యక్షులు అడ్వకేట్ జస్బీర్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రమోద్ అగర్వాల్ మెమెంటోతో సత్కరించారు. ఎఫ్‌సీసీఐ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రమోద్ అగర్వాల్ మాట్లాడుతూ, ఎఫ్‌సీసీఐ ఏర్పాటు చేసి 45 సంవత్సరాలు పూర్తవుతుండగా, ఈ ఏడాదితో భారత్, నెదర్లాండ్స్ స్నేహానికి 75 ఏళ్లు పూర్తవుతున్నాయని తెలిపారు. భారత సంతతి వారిగా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతోనే ఈ కాన్ఫరెన్స్ నిర్వహించామని అన్నారు. పెట్టుబడుల పరంగా భారత్, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం ప్రధాన గమ్యస్థానంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్యానెల్ డిస్కషన్‌లో పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడి విధానాలను వివరించారు. అలాగే పర్యావరణ హితంగా విశాఖ సంస్థ తీసుకువచ్చిన ఉత్పత్తులు అద్భుతమని ప్రశంసించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సముద్రాల సాయి కిరణ్ మాట్లాడుతూ, తెలంగాణ బిడ్డగా ఎఫ్‌సీసీఐలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని, నెదర్లాండ్స్‌లో పారిశ్రామికవేత్తగా కొనసాగుతున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా ఎదుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా భారత్, నెదర్లాండ్స్ మధ్య ఆర్థిక, పారిశ్రామిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## దాస్ సేవాసమితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్ అందజేత.



చిట్యాల : అక్షర కలం నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని గుండ్రంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాస్ సేవాసమితి ఫౌండేషన్ హైదరాబాద్ వారి సౌజన్యంతో శుక్రవారం ఒక్కో జత స్పోర్ట్స్ డ్రెస్ లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ అందించేందుకు ముందుకు వచ్చిన దాస్ సేవాసమితి హైదరాబాద్ ఫౌండేషన్ చైర్పర్సన్ గాయత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే దుస్తులు తమ పాఠశాల విద్యార్థులకు అందించేందుకు సహకరించిన పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చెన్నూరు నర్సింగరావు, ఉపాధ్యాయుడు పనకంటి వెంకట్రావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మసరం శ్రీనివాస్, తనకంటి వెంకట్రావు, అఫ్జల్ షరీఫ్, ఉప్పల పద్మ, గుత్త రామ్ రెడ్డి, సల్ల వెంకట్ రమణ, జిల్లోజు వెంకటేశ్వర్లు కాశరాజు ప్రణయ, రేణుక పాల్గొన్నారు.

## సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం మందమర్రి బ్రాంచ్ ఎన్నికలు

మందమర్రి/ చెన్నూరు డిసెంబర్ 19 అక్షర కలం ప్రతినిధి:



-సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం మందమర్రి ఏరియా బ్రాంచ్ ఎన్నికలు నిర్వహించి, నూతన కమిటీని ఎన్నుకోబో తున్నట్లు ప్రస్తుత ఏరియా ప్రధాన కార్యదర్శి అంగోత్ రవి నాయక్, సెంట్రల్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు వాంకుదోత్ శివ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎన్నిక మందమర్రి లోని స్థానిక సి ఈ ఆర్ క్లబ్ లో 21వ, తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతాయని ఎన్నికలకు ప్రత్యేక ఆహ్వానితులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోల్ల రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్య కృష్ణ మూర్తి హాజరవుతారని తెలిపారు. మందమర్రి ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి గిరిజన ఉద్యోగులందరూ సకాలంలో హాజరై నూతన కమిటీని ఎన్నుకోవాల్సిందిగా కోరారు.

## తరుణ్ ఫౌండేషన్ సహకారంతో ఆర్థిక సహాయం

ఆత్మకూర్( ఎం) అక్షరకలం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నటువంటి



బొలుగుల బాలయ్య ని పరామర్శించిన తరుణ్ ఫౌండేషన్ అధినేత గుర్రం నరసింహులు సహకారంతో 5000 రూపాయలు తాజా మాజీ జెడ్పిటిసి కోడిత్యాల నరేందర్ గుప్త , పిఎసిఎస్ డైరెక్టర్ తండ నరసింహ గౌడ్ వారిని కలిసి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

# అమ్మ.. నాకు బ్రతకాలని లేదు.!

### గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం.!

కళాశాల మూడవ భవనం

నుండి దూకిన విద్యార్థిని

ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స

విషమంగానే యువతి పరిస్థితి

ఘటనపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థి సంఘాలు

అక్షరకలం నల్గొండ



నల్లగొండ మండలం చర్లపల్లి సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని శివాని శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శుక్రవారం ఉదయం సమయంలో శివాని కళాశాలలోని మూడవ ఫ్లోర్ నుండి కిందకి దూకింది. శివాని స్వగ్రామం చండూరు మండలం జోగిగూడెం. కాగా బిల్డింగ్ పై నుండి దూకిన శివానిని గుర్తించిన సహచర విద్యార్థులు, అధ్యాపకులు కలిసి వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం యువతి పరిస్థితి విషమంగా ఉంది. కాగా జీవితంపై విరక్తి చెంది తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు శివాని సూసైడ్ లెటర్ రాసిందని రూరల్ ఎస్సై సైదా బాబు చెప్పారు. విద్యార్థినికి తల, మెడ ప్రాంతంలో తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపై విద్యార్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టాల్సిందిగా విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

**ఇంటెన్షియల్ గా జంప్ చేసింది... డాక్టర్ పవిత్ర వాణి**

**( సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ చర్లపల్లి )**



విద్యార్థిని పై నుండి ఇంటెన్షియల్ గానే జంప్ చేసింది. సమాచారం అందిన వెంటనే నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చాము. డాక్టర్లు ట్రీట్మెంట్ చేశారు. ఫస్ట్ ఎయిడ్ చేసుకుంటూనే ఆసుపత్రికి తీసుకువచ్చాము. న్యూరో సర్జన్ అందుబాటులో లేకపోవడంతో వైద్యులు గాంధీ హాస్పిటల్ కు రిఫర్ చేశారు. పేరెంట్స్ సూచన మేరకు ఐకాన్ హాస్పిటల్ కు తీసుకు వచ్చాము. పొద్దున్నుండి అందరము డ్యూటీలోనే ఉన్నాము. పోలీసులు ప్రిలిమినరీ ఎంక్వయిరీ చేశారు. ఫర్దర్ ఎంక్వయిరీ చేస్తారు. కళాశాలలో సీసీ కెమెరాలు కూడా పనిచేస్తూ ఉన్నాయి.

**సమగ్ర విచారణ చేపట్టాలి...(ఎస్ఎఫ్ఐ డిమాండ్)**


విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకార నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట







# అభిజ్ఞాన్ కుందు వీరవిహారం

దుబాయ్‌లోని సెవెన్స్ స్టేడియం వేదికగా మలేషియాతో జరిగిన మ్యాచ్‌లో భారత యువ కెరటం అభిజ్ఞాన్ కుందు వీరవిహారం చేశాడు. కేవలం 121 బంతుల్లోనే డబుల్ సెంచరీ పూర్తి చేసి స్టేడియంలో ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించాడు. టాస్ గెలిచిన మలేషియా తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. భారత ఇన్నింగ్స్ 5వ స్థానంలో క్రీజులోకి వచ్చిన కుందు.. ఆరంభం నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 80 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసిన అభిజ్ఞాన్ కుందు.. ఆ తర్వాత మరింత వేగంగా ఆడి డబుల్ సెంచరీ మార్కును చేరుకున్నాడు.ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో అండర్-19 ఆసియా కప్ చరిత్రలో డబుల్ సెంచరీ బాదిన తొలి భారతీయ బ్యాటర్‌గా అభిజ్ఞాన్ కుందు రికార్డు సృష్టించాడు. మొత్తం 125 బంతులు ఎదుర్కొన్న కుందు.. 209 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో 16 ఫోర్లు, 9 భారీ సిక్సర్లు ఉన్నాయి. అంతకుముందు యూఏఈపై వైభవ్ సూర్యవంశీ నెలకొల్పిన 171 పరుగుల అత్యధిక స్కోరు రికార్డును కుందు తుడిచిపెట్టేశాడు. కుందు విధ్వంసానికి తోడు వేదాంత్ త్రివేది (90), వైభవ్ సూర్యవంశీ (50) కూడా రాణించడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 408 పరుగుల భారీ స్కోరును సాధించింది. అయితే ఈ అద్భుత ప్రదర్శన విషయంలో ఒక సాంకేతిక పరమైన చిక్కు ఉంది. మలేషియా క్రికెట్ జట్టు ఐసీసీలో పూర్తి స్థాయి సభ్యత్వం లేని జట్టు కావడం వల్ల, ఈ మ్యాచ్‌కు అధికారిక 'యూత్ వన్డే' హోదా లభించదు.

# మార్చి 26 నుంచి ఐపీఎల్?!!

2026 ఐపీఎల్? సీజన్?కు సంబంధించిన షెడ్యూల్ దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది మార్చి 26న టోర్నీ ప్రారంభమై మే 31న ఫైనల్?తో ముగుస్తుందని సమాచారం. ఈ మేరకు క్రీడా వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఇవాళ వచ్చే సీజన్? కోసం ప్లేయర్ల మినీ వేలం అబుదాబీ వేదికగా జరుగుతోంది. ఈ వేలం సందర్భంగా సోమవారం సాయంత్రం ఐపీఎల్ నిర్వాహకులు సమావేశం అయ్యారు. ఈ మీటింగ్?లోనే వచ్చేకు సీజన్?కు సంబంధించిన తేదీలపై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే ఓపెనింగ్ మ్యాచ్?కు బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదిక కానుందని తెలుస్తోంది. ఈ ఏడాది జూన్?లో ఆర్సీబీ విజయోత్సవాల వేళ తొక్కిసలాట జరిగిన నేపథ్యంలో చిన్నస్వామిలో మ్యాచ్?లు నిర్వహించడం నిషేధించారు. దీంతో వచ్చే ఏడాది ఆర్సీబీ హోం గ్రౌండ్ మ్యాచ్?లు ఇంకో స్టేడియానికి తరలించనున్నారని వార్తలు వచ్చాయి. కానీ, చిన్నస్వామి మ్యాచ్?లకు అక్కడి నుంచి తరలించేందుకు కర్ణాటక ప్రభుత్వం ఒప్పుకోవడం లేదు. అయితే అన్ని భద్రతా చర్యలతో అక్కడ మ్యాచ్?లు నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ డొమెస్టిక్ టోర్నీ పాకిస్థాన్ సూపర్ లీగ్ కూడా అదే రోజు ప్రారంభం కానుంది. పీఎస్ఎల్ టోర్నీ 2026 మార్చి 26న ప్రారంభం కానుంది. దాదాపు ఐపీఎల్ కూడా అప్పుడే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. దీంతో మరోసారి ఐపీఎల్-పీఎల్?ఎల్ ఒకే విండోలో జరిగేలా కనిపిస్తోంది. గతేడాది కూడా ఈ రెండు టోర్నీలు ఏప్రిల్- మే విండోలోనే జరిగాయి. కానీ ఇప్పుడు ఐపీఎల్ మార్చి 26 డేట్ కన్ఫార్మ్ అయితే- రెండు టోర్నీలు ఒకే రోజు షురూ అవుతాయి. ఇలా జరగడం ఇదే తొలిసారి కానుంది. ఈసారి ఐపీఎల్ సీజన్?కు పలువురు స్టార్ ప్లేయర్లు దూరం కానున్నారు. స్టార్ ఆల్?రౌండర్ ఆండ్రీ రసెల్ ఐపీఎల్?కు ఇటీవల రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇకపై అతడు కేకేఆర్ జట్టులో కోచింగ్ స్టాఫ్?లో కనిపించనున్నాడు.



# అండర్ 19 ఆసియా కప్ టోర్నీలో యువ భారత్ జోరు

**315 పరుగుల భారీ తేడాతో భారత జట్టు గెలుపు**

**హ్యాట్రిక్ విక్టరీని ఖాతాలో వేసుకున్న భారత్..**

అండర్ 19 ఆసియా కప్ 2025 టోర్నీలో యువ భారత్ జోరు కొనసాగుతోంది. దుబాయ్ వేదికగా మంగళవారం జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఆయుష్ మాత్రే సారథ్యంలోని భారత జట్టు 315 పరుగుల భారీ తేడాతో మలేషియాను చిత్తు చేసింది. ఈ గెలుపుతో హ్యాట్రిక్ విక్టరీని ఖాతాలో వేసుకున్న భారత్.. గ్రూప్-ఏలో అగ్రస్థానంలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 408 పరుగుల భారీ స్కోరు చేసింది. అభిజ్ఞాన్ కుందు(125 బంతుల్లో 17 ఫోర్లు, 9 సిక్స్‌లతో 209 నాటౌట్) అజేయ డబుల్ సెంచరీతో చెలరేగగా.. వైభవ్ సూర్యవంశీ(26 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. మలేషియా బౌలర్లలో ముహమ్మద్ అక్రమ్(5/89) ఐదు వికెట్లు తీయగా.. సత్నకుమారన్, కృష్ణమూర్తి చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం మలేసియా 32.1 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.




# రవి బిష్ణోయ్‌ను వదిలేసిన సన్‌రైజర్స్

ఐపీఎల్ 2026 మినీ వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్ ఘోర తప్పిదం చేసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మంగళవారం అబుదాబి వేదికగా జరిగిన ఈ మినీ ఆక్షన్‌లో రూ.25.5 కోట్ల భారీ పర్స్‌తో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఒక్క టాప్ ప్లేయర్ కోసం కూడా ప్రయత్నించలేదు. కనీస ధరకు అందుబాటులో ఉన్న ఆటగాళ్లను కూడా కొనుగోలు చేయలేదు. కావ్యమారన్ సారథ్యంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆక్షన్ టీమ్ సైలెంట్‌గా ఉండిపోయింది. అయితే టీమిండియా స్పిన్నర్ రవి బిష్ణోయ్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ తీవ్రంగా ప్రయత్నించి చివర్లో చేతులెత్తేసింది. రవి బిష్ణోయ్‌ను వదిలేసి కావ్య మారన్ పెద్ద తప్పిదం చేసిందని క్రికెట్ విశ్లేషకులు, నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు క్వాలిటీ స్పిన్నర్ అవసరం ఉంది. గతేడాది రాహుల్ చాహర్ తీవ్రంగా నిరాశపర్చడంతో అతన్ని వేలంలోకి వదిలేసిన ఆరెంజ్ ఆర్మీ.. రవి బిష్ణోయ్‌తో అతని స్థానాన్ని భర్తీ చేయాలని ప్రయత్నించింది. కానీ రూ.7 కోట్ల వరకు బిడ్ వేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. రాజస్థాన్ రాయల్స్ రూ.7.20 కోట్లకు బిడ్ వేయడంతో వెనక్కి తగ్గింది.దాంతో రవి బిష్ణోయ్ రాజస్థాన్ రాయల్స్ సొంతమయ్యాడు. అనంతరం అకీబ్ దార్ కోసం ప్రయత్నించిన కావ్య మారన్.. అతని రేటు కూడా పెంచి వదిలేసింది. అనామక ఆల్‌రౌండర్ ప్రశాంత్ వీర్ కోసం కూడా సన్‌రైజర్స్ తీవ్రంగా ప్రయత్నించింది. రూ.30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన అతని ధరను రూ.14.20 కోట్లకు పెంచింది. చివరకు సీఎస్‌కే ఆ ధరకు అతన్ని కొనుగోలు చేసింది.



# సూర్య, గిల్ చెలరేగుతారు.. నాది గ్యారంటీ

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ అండగా నిలిచాడు. ఈ ఇద్దరూ ప్రపంచకప్‌లో చెలరేగుతారని, తనది గ్యారంటీ అని చెప్పుకొచ్చాడు.సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మూడు మ్యాచ్‌ల్లో సూర్య, గిల్ దారుణంగా విఫలమయ్యారు. సూర్య వరుసగా 12 (11), 5 (4), 12 (11) పరుగులు చేస్తే.. శుభ్‌మన్ గిల్, 4, 0, 28 పరుగులే చేసి నిరాశపర్చాడు. ఈ ఏడాది సూర్య 213 పరుగులు చేయగా.. శుభ్‌మన్ గిల్ 293 పరుగులే చేశాడు. టీ20 ప్రపంచకప్ ముందు ఈ ఇద్దరూ స్టార్ ఆటగాళ్ల పేలవ ఫామ్ ఆందోళనకు గురి చేస్తోంది.

# విపత్తు సమయంలో ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట అక్షర కలం

జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వరదలు, పరిశ్రమల ప్రమాదాల నివారణపై ఈనెల 22న నిర్వహించు మాక్ ఎక్సర్సైజ్ గురించి




శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎన్ డిఎంఎ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ) డైరెక్టర్ సుధీర్ బాల్, తెలంగాణ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణరావు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.




ఈ సందర్భంగా సి ఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ వరదలు, పరిశ్రమల, రహదారుల ప్రమాదాలే కాక వివిధ రకాలుగా జరిగే విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, ముందు జాగ్రత్తలపై సంబంధిత శాఖల యంత్రాంగానికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. వరదల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడం, వరద నీటిలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి రిలీఫ్ క్యాంపులలో అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివిధ ప్రమాదాల్లో గాయపడ్డ క్షతగాత్రులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విపత్తు సమయంలో నీటిపారుదల, విద్యుత్, రహదారుల, పోలీస్, వైద్య, పౌరసరఫరాల, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేసేందుకు ఏటా మాక్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ వరదలు, విపత్కర పరిస్థితులలో అగ్నిమాపక, పోలీస్, రెవిన్యూ శాఖలు అప్రమత్తంగా ఉండి తగిన విధంగా చూసుకోవాలని వరదలు వచ్చినప్పుడు ఏ ప్రాంతం నుండి ఏ ప్రాంతం వైపు వెళ్ళాలి, ఉపశమన శిబిరం ఎక్కడ పెట్టాలి అనేది ముందుగానే చూసుకోవాలని అన్నారు. సహాయక శిబిరంలో ఆహారం, త్రాగునీరు, శానిటేషన్, మెడిసిన్స్ ఉండే విధంగా చూసుకోవాలని శిబిరంలో ఎక్కువ రోజులు బాధితులు ఉన్నట్టయితే వారికి సరిపోను రేషన్ బియ్యం సరుకులు, నూనెలు పంపిణీ చేయాలని, పాఠశాలలోకి వరద నీరు వస్తే ముందుగా పిల్లలను రక్షించాలని, పంటలకు నష్టం జరగకుండా ముందుగానే తగిన ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రైతులను న్యూస్ ఛానల్, రేడియోల ద్వారా తుఫాన్ హెచ్చరికలు జారీ చేయాలని చెరువు గట్లు, ఏటి గట్లు పటిష్టంగా ఉండే విధంగా చూసుకోవాలని వరదలు, విపత్కర పరిస్థితులలో ప్రజలను అప్రమత్తము చేయడానికి మూడు మున్సిపాలిటీలు, నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఏదో ఒక ప్రాంతంలో మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ ఏర్పాటు చేయాలని ఇట్టి మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ లో అగ్నిమాపక, పోలీస్, రెవిన్యూ, రవాణా శాఖలను, ప్రజలను భాగస్వాములు చేయాలని ఇలాంటి మాక్ డ్రిల్ ఎక్సర్సైజ్ వల్ల ప్రజలలో ఒక అవగాహన కలిగి వరదలు, విపత్కర పరిస్థితిలో తమను తాము రక్షించుకోవడంలో ఉపయోగపడతాయని కలెక్టర్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు అదనపు కలెక్టర్ కె సీతారామారావు అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి,జెడ్పి సీఈఓ వివి అప్పారావు,డిపిఓ యాదగిరి,ఇండస్ట్రియల్ జి ఎం సీతారాం,ఆర్ డి వో లు సూర్యనారాయణ,వేణుమాధవ్ మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, డి ఎమ్ హెచ్ ఓ వెంకటరమణ, డిఎస్ఓ శోభన్ బాబు, డిఎం రాము, పశు సంవర్ధన అధికారి శ్రీనివాసరావు,ఆర్ అండ్ బి ఈ సీతారామయ్య పంచాయతీ రాజ్ ఈ ఈ లు వెంకటయ్య, మాధవి,డి వై ఎస్ ఓ వెంకటరెడ్డి,తదితరులు హాజరైనారు

## సచివాలయ ముట్టడిని విజయవంతం చేద్దాం



అక్షర కలం, ఆమనగల్లు :

న్యాయవాదుల రక్షణ చట్టం కోసం ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండే కార్ యాదిలాల్ తెలిపారు. ఆమనగలు పట్టణంలో ఈనెల 22న పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు . ఆమనగల్లు కోర్టు ఆవరణలో శుక్రవారం సచివాలయం ముట్టడి, పాదయాత్ర విజయవంతం పై బార్ అసోసియేషన్ సభ్యులు సన్నాహక సమావేశం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాదయాత్ర విజయవంతం పై చర్చించారు. ఈ సందర్భంగా యాదిలాల్ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం రూపకల్పన ప్రభుత్వం పై ఒత్తిడికి పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. నాలుగు ప్రధాన డిమాండ్లతో సచివాలయం వరకు పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించి అమలు చేయాలని, 41 ఏ పిఆర్ పిసి చట్టం సవరించాలని, న్యాయవాదులకు ఆరోగ్య భీమా రూ .2 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకురూ.10 వేలు స్టైఫండ్ ఇవ్వాలని యాది లాల్ కోరారు. 22న ఉదయం 10 గంటలకు ఆమనగల్లు కోర్టు ఆవరణలో పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పాదయాత్రలో పలు బారాసోసియేషన్ల సభ్యులు, న్యాయవాదులు పాల్గొంటున్నట్లు తెలిపారు. మొదటిరోజు కందుకూరు వరకు పాదయాత్ర కొనసాగుతుందని, రెండవ రోజు తుక్కుగూడ వరకు, మూడవరోజు సచివాలయం వరకు పాదయాత్ర ఉంటుందని వివరించారు. న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సన్నాహక సమావేశంలో ఆమనగల్లు బార్ అసోసియేషన్ కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ,సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి కొప్పు కృష్ణ, గ్రంథాలయ సెక్రటరీ పసుపుల మల్లేష్,క్రీడా కార్యదర్శి శేఖర్, సభ్యులు సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, మల్లేపల్లి జగన్, మల్లేష్,మధు గౌడ్, గణేష్ గౌడ్, జగన్ గౌడ్, సంతోష్,దేవేందర్,శివ శంకర్,మహేశ్వర్, మహేష్, బిక్యానాయక్, సర్దార్ నాయక్. శ్రీనివాస్, శిరీష్, శ్రీశైలం, రమేష్, నరేందర్, రామచందర్, మహేష్, తదితరులు ఉన్నారు.

## పంచాయితీలకు సెలవ్.. పెట్టండి

ఎంపిటిసి,జడ్పీటిసిలకు ప్రిపేర్ కండి

గులాబీ జెండాను హత్తుకున్న ప్రజలు

ఇక అన్ని ఎన్నికల్లో మనమే గెలవాలి

గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కెటిఆర్

రాజన్నసిరిసిల్ల, అక్షర కలం,

పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం సులభం కానీ.. పంచాయతీ ఎన్నికల్లో గెలవడం కష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవలేదని.. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో గెలిచిందని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సమావేశమైన కేటీఆర్.. వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలు అయిపోయాయి కాబట్టి.. పగలు, పంచాయితీలో పక్కనబెట్టి కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండాను గుండెలను హత్తుకున్నారని కేటీఆర్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కొన్ని చోట్ల రెండు వైపులా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే నిలబడ్డారని తెలిపారు. త్వరలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి, మండల పరిషత్‌కు అనుసంధానకర్త ఎంపీటీసీ అని కేటీఆర్ తెలిపారు. అలాగే జిల్లా పరిషత్‌కు, మండల పరిషత్‌కు సమన్వయకర్త జడ్పీటీసీ అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలతో పంచాయితీలు పక్కనపెట్టాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్లలెప్లలెనా డంపింగ్ యార్డులు, ప్రగతి వనాలు ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు.సిరిసిల్లలో ఉన్న 57 ఎంపీటీసీ స్థానాలు గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అందరూ కలిసి కాంగ్రెస్‌పై కొట్లాడాలన్నారు. గులాబీ గెలుపును చూసి కాంగ్రెస్ పరేషన్ అయితోందని తెలిపారు. ఓడిపోయిన అభ్యర్థులు కూడా ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేయాలన్నారు. పాత తరం నాయకులు, కొత్త తరాన్ని కలుపుకుంటూ ముందుకుపోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అప్పటికప్పుడు మాటలు మారుస్తున్నారని కేటీఆర్ అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మొదట 66 శాతం సర్పంచ్ స్థానాలు గెలిచామని చెప్పారని తెలిపారు. వెంటనే మాటమార్చి స్థానిక ఎన్నికలతో పార్టీకి సంబంధం లేదంటున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి లాగే ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా మాటలు మారుస్తున్నారని అన్నారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరానని కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు మాటమార్చి బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెబుతున్నారని తెలిపారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని పరిస్థితిలో కడియం, పోచారం ఉన్నారని విమర్శించారు. గడ్డిపోచలాంటి పదవి కోసం చూరుకు గబ్బిలాల్లా వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు.గెలుపు కోసం కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ప్రజలు మాత్రం బీఆర్ఎస్‌తోనే ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో గులాబీ ప్రభంజనమే అందుకు నిదర్శనమని చెప్పారు. సర్పంచ్ అయినా ఎమ్మెల్యే, ఎంపీలు అయినా ప్రజల కోసమే పనిచేయాలని అన్నారు. ప్రతిపైసా ప్రజల కోసమే ఖర్చు పెట్టాలని సూచించారు. ఐదు అంచెల్లో ప్రభుత్వాన్ని ఎలా నడపాలో అంబేద్కర్ రాజ్యాంగంలో చెప్పారని గుర్తుచేశారు. కేంద్రం పైసలు ఇయ్యకున్నా.. రాష్ట్ర నిధులు ఉంటాయని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులు ఫైనాన్స్ కమిషన్ నుంచి వస్తాయని పేర్కొన్నారు. దాన్ని ఆపే హక్కు ఎమ్మెల్యేలకు లేదు.. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఉండదని స్పష్టం చేశారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి..జిల్లా కలెక్టర్ హనుమంతరావు

యాదాద్రిభువనగిరి అక్షరకలం

రామన్నపేట మండలం తుమ్మల గూడెం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం తనిఖీ చేశారు. కలెక్టర్ కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి కొనుగోలు ఎందుకు ఇంత ఆలస్యం అయిందని, ఇప్పటికే రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పూర్తి చేయాలని, ఆలస్యం చేయకుండా వెంటనే కాంటా వేసి కొనుగోలు పూర్తి చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసినంత వరకు టాబ్ ఎంట్రీ పూర్తి చేశారా అని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ ఉండకుండా ఎప్పటికపుడు ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలన్నారు. ట్యాబ్ ఎంట్రీలు పూర్తయిన రైతుల అకౌంట్ లలో డబ్బులు జమ అయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ విద్య, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి విద్యార్థికి అందాలి

పూర్తిస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

అక్షరకలం ప్రతినిధి, నల్గొండ





ప్రభుత్వ విద్య, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి విద్యార్థికి పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ ల పై శనివారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్య, సంక్షేమ శాఖలు, లీడ్ బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. స్కాలర్షిప్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, అర్హత, నిర్ధారణ, బ్యాంకు ఖాతాల ధ్రువీకరణ వంటి అన్ని దశలను సమయపాలనతో పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాల అనుసంధానంలో లోపాలు, ఆధార్ సీడింగ్ సమస్యల వల్ల విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా లీడ్ బ్యాంక్ అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. 50 శాతం దరఖాస్తులు పూర్తిచేసిన మండలాలు 100 శాతం పూర్తి చేసే విధంగా ప్రయత్నం చేయాలని ఎంఈఓ లకు ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో 6 శాతం ఉన్న స్కాలర్షిప్ దరఖాస్తులను 60 శాతం పూర్తి చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కు అభినందనలు తెలియజేశారని, ఇది అందరి సమిష్టి కృషి అని తెలిపారు. 100 శాతం దరఖాస్తులు పూర్తిచేసిన తిరుమలగిరి సాగర్ ఎంఈఓ ను కలెక్టర్ అభినందించారు. విద్యాశాఖ, సంక్షేమ శాఖ అధికారులు విద్యాసంస్థల స్థాయిలో అవగాహన కల్పిస్తూ విద్యార్థులు స్కాలర్షిప్లకు దూరం కాకుండా పర్యవేక్షణ చేసి స్కాలర్షిప్ అందే విధంగా చూడాలని అన్నారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శశికళ, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ శ్రామిక్, తదితరులు ఉన్నారు.

## యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం జిల్లా కలెక్టర్ హనుమంతరావు

యాదాద్రిభువనగిరి అక్షరకలం



ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీ (సోమవారం) నుండి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ హనుమంత రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

యాదాద్రిభువనగిరి అక్షరకలం

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు, జిల్లా యువజన, క్రీడలు, టూరిజం అధికారి ధనంజనేయులుతో కలిసి 100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ కాంటెస్ట్ పోస్టర్ ను శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ హనుమంత రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అద్భుతమైన, ఎవరికీ తెలియని పర్యాటక ప్రాంతాలను వెలుగులోకి తెచ్చేందుకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ రాష్ట్రంలో దాగి ఉన్న పర్యాటక అందాలను ఫొటోలు, వీడియోల రూపంలో పరిచయం చేసిన వారికి భారీ నగదు బహుమతులు అందించనున్నట్లు టూరిజం ఎండీ వల్లూరు క్రాంతి తెలిపారని ఆయన పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు వచ్చే పర్యాటకుల కోసం వారి అభిరుచికి తగ్గట్టు కస్టమ్ టూర్స్ పేరుతో సరికొత్త సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన చెప్పారు. జిల్లా యువజన, క్రీడల, టూరిజం అధికారి ధనంజనేయులు మాట్లాడుతూ ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, కుటుంబాలు వారాంతాల్లో వెళ్లేందుకు కొత్త ప్రదేశాలను అన్వేషిస్తుంటారని, ఈ నేపథ్యంలోనే 100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ పేరుతో ఒక పోటీని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు పెద్దగా తెలియని జలపాతాలు, పురాతన దేవాలయాలు, ట్రెక్కింగ్ పాయింట్లు వంటి 100 కొత్త గమ్యస్థానాలను గుర్తించి, వాటి వివరాలతో ఒక కాఫీ టేబుల్ బుక్ రూపొందించడమే ఈ పోటీ లక్ష్యమని ఆయన అన్నారు.



## ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..

కంది మండలం కాశీపూర్ గ్రామ సర్పంచ్ కృష్ణ గౌడ్ నివాసంలో శుక్రవారం అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు గంగాధర్ గురుస్వామి ఆధ్వర్యంలో అభిషేకం మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కృష్ణ గౌడ్ మాట్లాడుతూ కాశిపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, తనను గెలిపించిన కాశీపూర్ గ్రామ ప్రజలందరికీ రుణపడి ఉంటానని ఆయన అన్నారు.

## ధోనిపాముల ఉపసర్పంచ్ ఏకగ్రీవం

అక్షరకలం చండూరు

చండూరు మండల పరిధిలోని ధోనిపాముల గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ గా తిప్పర్తి



రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియను చండూరు ఎంపీడీవో బి.యాదగిరి స్వయంగా పర్యవేక్షించారు. ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక జరగడం గ్రామ ఐక్యతకు నిదర్శనమని ఎంపీడీవో ఈ సందర్భంగా కొనియాడారు, అనంతరం నూతన ఉపసర్పంచ్ ని గ్రామస్తులు, వార్డు సభ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక



# చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## మంది పల్లి గ్రామ సర్పంచ్ గా సురేందర్ రెడ్డి గణ విజయం:- గ్రామ ఉపసర్పంచ్ గా చెట్టుకింది నరేష్..

.( అక్షర కలం,నారాయణపేట, జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 19, )



ధన్వాడ : నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని మంది పల్లి గ్రామ సర్పంచ్ గా సురేందర్ రెడ్డి ఎంపికయ్యారు. అదేవిధంగా ఉప సర్పంచ్ గా చెట్టుకింది నరేష్ ,వార్డు సభ్యులు ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సురేందర్ రెడ్డి, మాట్లాడుతూ మందపల్లి గ్రామ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని ఆయన వివరించారు. వార్డు సభ్యులు చంద్రకళ, చింతల, వెంకటయ్య, అరుణ, దాసరి యశోద, కొండపూర్ నరేష్, చింతల భావ్య, బిఆర్ఎస్ పార్టీ, డిఎస్పి పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణయ్య పల్లి గ్రామ సర్పంచ్ గా కవిత తిరుపతయ్య

( అక్షర కలం, నారాయణపేట, జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 19, )



నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని రాంకిష్టయ్య పల్లి గ్రామ సర్పంచ్ గా కవిత తిరుపతయ్య ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ గా నారాయణరెడ్డి ని ఎన్నుకున్నారు. వార్డు సభ్యులుగా కాజా పాషా, తిరుపతయ్య, మన్నెమ్మ, గోపాల్ నాయక్ ,సరోజ, శంకర్ నాయక్, గోపి నాయక్, తదితరులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కవిత తిరుపతయ్య మాట్లాడుతూ రాంక్రిష్టయ్య పల్లి గ్రామ అభివృద్ధి కోసం తమవంతుగా కృషి చేస్తానని ఆమె తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మినిస్టర్ ఓవర్సీస్ స్కీమ్ స్కాలర్‌షిప్ కింద ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం.

### మైనారిటీ విద్యార్థుల కోసం చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కీమ్ స్కాలర్‌షిప్ కింద ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం. డిసెంబర్ 20 నుండి జనవరి 19 వరకు దరఖాస్తు గడువు:. ఎంఏ .రషీద్

(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, డిసెంబర్,19)

నారాయణపేట జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖఅధికారి ఎంఏ .రషీద్ ప్రెస్ నోట్ విడుదల చేస్తూ, తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ నిర్వహించిన చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం (సీఎంఓ ఎస్ ఎస్ )ఫాల సీజన్ 2025 కింద, విదేశాలలో ఉన్నత విద్య (పోస్ట్ గ్రాడ్యుయేట్/పిహెచ్‌డి) చదువుతున్న మైనారిటీ విద్యార్థుల (ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన, బౌద్ధ, పార్సీ) నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అమెరికా, యుకె, ఆస్ట్రియా, కెనడా, సింగపూర్, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్, ఫ్రాన్స్ మరియు న్యూజిలాండ్ వంటి విదేశీ దేశాల గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలలో (1.07.2025 నుండి 31.12.2025 వరకు) పోస్ట్ గ్రాడ్యుయేట్ లేదా పిహెచ్‌డి అధ్యయనాలలో ప్రవేశం పొందిన మరియు ప్రభుత్వ అర్హత నియమాలన్నింటినీ నెరవేర్చిన అర్హతగల అభ్యర్థులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్‌లో (లిలిలి.బివశ్రీజీనిణజీనిజీవజూజీబబ.ఞణణ.ణనీల.తిని) సమర్పించవచ్చని ఆయన అన్నారు. అర్హులైన అభ్యర్థులు 19.01.2026 సాయంత్రం 5.00 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించవచ్చని శంకరాచారి తెలిపారు. తరువాత, దరఖాస్తు హార్డ్ కాపీ మరియు అవసరమైన పత్రాలు/ధృవపత్రాలను 20-02-2026 సాయంత్రం 5.00 గంటలలోపు జిల్లా అధికారి, మైనారిటీ సంక్షేమ శాఖ, నారాయణపేటకు సమర్పించండి. ఈ పథకం కింద ఎంపికైన



విద్యార్థులకు రూ. 20 లక్షలు మరియు రూ. 60,000 వన్-వే విమాన ఛార్జీ (లేదా వాస్తవ ఛార్జీ, ఏది తక్కువైతే అది) ఇవ్వబడుతుందని ఆయన చెప్పారు. పత్రాల పరిశీలన సమయంలో నకిలీ సర్టిఫికెట్లు ఉంటే అభ్యర్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. వయస్సు, విద్యార్హత, వార్షిక ఆదాయం మరియు ఇతర ముఖ్యమైన వివరాలతో సహా పథకం యొక్క అన్ని వివరాల కోసం, వెబ్‌సైట్‌ను సందర్శించండి. నారాయణపేట లో అర్హులైన మైనారిటీ విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మరియు పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికారి ఎంఏ.రషీద్ విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి, (కలెక్టరేట్ కాంప్లెక్స్) ని సంప్రదించండి.
( ఎం ఏ .రషీద్) జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి, నారాయణపేట

## రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 19:

చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ కమ్యూనిటీ భవన్ ప్రారంభోత్సవ





కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి హాజరై కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా చెన్నూరు మండల కేంద్రంలో 20 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం జరిగిందని, భవనం మరింత విస్తరించేందుకు అదనంగా మరో 20 లక్షల రూపాయలను మంజూరు చేసి అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కమ్యూనిటీ భవనాన్ని దళిత సంఘాలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, నిర్దేశిత నిబంధనలతో భవన నిర్వహణ కొరకు కమిటీ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇదే తరహాలో భీమారం మండలంలో 25 లక్షల రూపాయలతో నేతకాని భవనం, జైపూర్ మండలంలో 25 లక్షల రూపాయల వ్యయంతో జగ్జీవన్ రామ్ భవనం, చెన్నూరు మండలంలో 25 లక్షల రూపాయల వ్యయంతో ముదిరాజ్ భవనం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా భవనాలకు అదనపు నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కమ్యూనిటీ భవన నిర్మాణం కొరకు భూమి కలిగి ఉన్నట్లయితే ప్రభుత్వం తరఫున భవన నిర్మాణానికి చేయూత ఇస్తామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో 15 కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, వచ్చే విడతలో 70,80 కోట్ల రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు త్రాగునీటి కొరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమృత్ పథకం ద్వారా నీటి ట్యాంకులు, పైప్ లైన్లు ఏర్పాటు చేసి నిరంతరం త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెన్నూరు ప్రాంతంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందని, మే నెల వరకు ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు, ఆసుపత్రిలో తగినంత సిబ్బంది నియామకానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం 9 కోట్ల 55 లక్షల రూపాయల టియుఎఫ్ఐడిసి నిధులతో చేపట్టిన సమీకృత కూరగాయల మార్కెట్ ను ప్రారంభించారు. ప్రజలందరికీ ఒకే చోట కూరగాయలు, మాంసపు ఉత్పత్తులు అందుబాటులో ఉంచేందుకు సమీకృత మార్కెట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, మాంసం ఉత్పత్తులకు సంబంధించి మార్కెట్లో నెలకొన్న సాంకేతిక సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూరు మండల కేంద్రంలోని 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మాత శిశు ఆసుపత్రిగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసి కిడ్నీ బాధితులకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అమృత్ పథకం క్రింద చెన్నూరు మున్సిపాలిటీలో 30 కోట్ల రూపాయలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 40 కోట్ల రూపాయలు, మందమర్రి మున్సిపాలిటీలో 30 కోట్ల రూపాయలతో ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అంబేద్కర్ భవనాన్ని ప్రజలు బహుళ ప్రయోజనాల కోసం వినియోగించుకోవచ్చని, ఈ భవనంలో గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమీకృత కూరగాయల మార్కెట్ ఏర్పాటు ద్వారా వీధి వ్యాపారులకు ఒక ఫ్లాట్ ఫాం ఏర్పాటుచేసి ఒకే చోట ప్రజలందరికీ కూరగాయలు, మాంసపు ఉత్పత్తులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని, సమీకృత మార్కెట్ లో సామూహిక సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అమృత్ పథకంలో భాగంగా పైప్ లైన్లు, 3 నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణంలో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి చేయడం జరిగిందని, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రాంతంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధితో పాటు ప్రజల సౌకర్యార్థం అంతర్గత రహదారులు, మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన వైద్యాధికారులు, సిబ్బందిని నియమించి ప్రజలకు వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం చెన్నూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో సమీక్షించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు, చెన్నూరు తహశీల్దార్ మల్లికార్జున్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తుల సమయంలో తక్షణమే స్పందించేలా సిద్ధంగా ఉండాలి

## జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి సుధీర్ బాల్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 19:

ప్రకృతి విపత్తుల సమయంలో తక్షణమే స్పందించి ప్రజారక్షణ చర్యలు చేపట్టేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి సుధీర్ బాల్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, నీటిపారుదల, పశు సంవర్ధక, పోలీస్, వ్యవసాయ, అగ్నిమాపక, రహదారులు, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య ఇతర అధికారులతో రక్షణ చర్యల ప్రణాళిక రూపకల్పన పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి మాట్లాడుతూ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్తంగా అన్ని శాఖల సమన్వయంతో పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజా రక్షణ పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షాల సమయంలో వరదలు సంభవించినప్పుడు జాతీయ, రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థల సమన్వయంతో వరద ప్రభావిత ప్రాంతాలలో ఆర్మీ సిబ్బంది వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రమాద సమయంలో ప్రజలకు చేయవలసిన ప్రమాద హెచ్చరికలు, ప్రజా అవగాహన కొరకు చేపట్టవలసిన






చర్యలు తెలుసుకోవాలని, అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాప్(సిఏపి) వ్యవస్థ, అత్యవసర నిర్వహణ కేంద్రాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని, విపత్తుల సమయంలో వినియోగించుకుని చేపట్టవలసిన ప్రజా రక్షణ చర్యలను అమలు చేయాలని తెలిపారు. వర్షాల సమయంలో వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు ముందుగా హెచ్చరికలు జారీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్, నేషనల్ డేటా బేస్ ఫర్ ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ ద్వారా వివరాలు తీసుకొని రక్షణ చర్యల దిశగా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు వారి పరిధిలోని విపత్తు ప్రభావిత ప్రాంతాలను తక్షణమే గుర్తించాలని, క్రమబద్ధమైన నిర్వహణ ప్రక్రియ కలిగి ఉండాలని తెలిపారు. పునరావాస కేంద్రాలలో కనీసం 10 రోజులు ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖలు తమ పరిధిలో చేపట్టవలసిన రక్షణ చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండి విపత్తు సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డిసెంబర్ 22వ తేదీన అన్ని జిల్లాలలో మాక్ డ్రిల్ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని చెన్నూరు మండల తహశీల్దార్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల రక్షణ దిశగా సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ, పునరావస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన ఆహారం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని, కేంద్ర, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల సమన్వయంతో ప్రజల రక్షణ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన గ్రామ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..



రాయిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కారిస్తానని, గ్రామ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతనని సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో మురికి కాలువల శుభ్రతపై దృష్టి సారించి జేసిబి సహాయంతో క్లీన్ చేశారు. వెంట వెంటనే పనులు ప్రారంభిస్తానని, పాఠశాల వద్ద నుండి బిడెకన్నె గ్రామం వెళ్లే రోడ్డుపై ఉన్న చెత్త చెదారంతో నిండి ఉన్న మురికి కాలువను జేసిబి సహాయంతో సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి పనులు చేయించారు. త్వరలోనే గ్రామ పుర వీధులలో ఉన్న విద్యుత్ స్తంభాలకు వీది లైట్లు, చెత్తసేకరణ కు ప్రత్యేకంగా డబ్బాలు ఏర్పాటు చేసి, ఆ డబ్బాలలో వేసిన చెత్తను నేరుగా ట్రాక్టర్ సహాయంతో తీసుకెల్లడం జరుగుతుందని తెలిపారు.

# సివిల్ సర్వీసెస్ ధ్యేయంగా ఉద్యాన విద్యార్థులు ఎదగాలి: రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్

**అక్షరకలం హైదరాబాద్**

ఉద్యాన విద్యార్థులు సివిల్ సర్వీసెస్ సాధించడమే ధ్యేయంగా పోటీ పరీక్షలలో రాణించాలని, తద్వారా దేశానికి అత్యున్నత సేవ చేసే భాగ్యం కలుగుతుందని రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మొదటి బోధన, బోధనేతర సిబ్బంది రాష్ట్రస్థాయి ఆటల, పోటీలు, సాంస్కృతిక, వైజ్ఞానిక పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యాన కళాశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు, లైబ్రరీ కావలసిన ఇతర అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి గారితో నివేదిస్తామని, అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా ప్రయత్నిస్తానని శాసనసభ్యులు టి. ప్రకాష్ గౌడ్






చెప్పారు. దైనందిన ఉద్యోగ విధులలో బాగా రాణించేందుకు ఆటల, పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. ఒత్తిడిని జయించే మార్గాలు సైతం ఉద్యోగ వృత్తిలో భాగమేనని ముగింపు కార్యక్రమానికి అధ్యక్షత శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ దండ రాజిరెడ్డి తెలిపారు. జన విశ్వవిద్యాలయం పూర్తిస్థాయి తెలంగాణ రైతు సేవలో నిమగ్నమై ఉందని, విద్య, విస్తరణ, పరిశోధన ద్వారా రాష్ట్ర రైతులు, ప్రజలకు అత్యంత చేరువవుతుందని వర్సిటీ వైస్ ఛాన్సర్ రాజిరెడ్డి అన్నారు. ప్రొఫెషనల్ ప్లేయర్స్ కి ఏమాత్రం తగ్గకుండా వర్సిటీ సిబ్బంది అన్ని అంశాల్లో పోటీ పడ్డారని డీన్ అఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జే. చీనా అన్నారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఇతర వ్యక్తిగత పోటీలలో విన్నర్స్, రన్నర్స్ బోధన, బోధనేతర సిబ్బందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్.శ్రీనివాసన్, యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ ఎం.రాజశేఖర్, రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్, ప్రొఫెసర్ పెడిగం సైదయ్య, డాక్టర్ వీణ జోషి, ప్రీతం గౌడ్, పోతరాజు యాదయ్య, చెంచురామయ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శివన్నగూడెంలో వినోద్ నాయక్ ఘన విజయం

**భారీ మెజారిటీతో వరుసగా రెండోసారి సర్పంచ్‌గా ఎన్నిక**

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**



స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో యువ నాయకుడు వినోద్ నాయక్ శివన్నగూడెం గ్రామ సర్పంచ్‌గా వరుసగా రెండోసారి భారీ మెజారిటీతో విజయం సాధించారు. నానమ్మ హామీని భాయ్ తాజా మాజీ సర్పంచ్‌గా ఐదేళ్ల పాటు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శంగా తీర్చిదిద్దిన నేపథ్యంలో, ఆమెను ఆదర్శంగా తీసుకున్న వినోద్ నాయక్ మరోసారి గ్రామ ప్రజల విశ్వాసాన్ని చూరగొని గెలుపొందడం విశేషంగా నిలిచింది.గెలుపు అనంతరం వినోద్ నాయక్ మాట్లాడుతూ, గ్రామస్తులు తనపై ఉంచిన నమ్మకాన్ని వృథా చేయనని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. శివన్నగూడెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తానని, గ్రామస్తుల సహకారంతో అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తానని చెప్పారు.

## కాంగ్రెస్ తో సొంతింటి కల సాధ్యం

**అక్షర కలం, ఆమనగల్లు :**




పేద ప్రజల సొంతింటి కల కాంగ్రెస్తో సాధ్యమని రేవంత్ మిత్రమండలి రాష్ట్ర నాయకులు కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు ప్రతిభ నగర్ కాలనీలో కమిషనర్ శంకర్ నాయక్ తో కలిసి మంజూరు పత్రాలను మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు సొంతిల్లు ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## 250 గజాల ఇంటి స్థలం కోసం మంత్రి పొంగులేటి ని కలిసిన తెలంగాణ ఉద్యమకారులు

**అక్షరకలం హైదరాబాద్**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి గారి ఆధ్వర్యంలో ఉద్యమకారులు కలిశారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్లినవారు, జైలుకు వెళ్ళని వారు, ఉద్యమంలో పాల్గొన్న వారి కి అందరికీ 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని అన్నారు. చాలామంది ఉద్యమకారులపై కేసులు కాలేదని అలాంటి వారిని కూడా గుర్తించి 250 గజాల ఇంటి స్థలానికి లబ్ధిదారులుగా చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు.



250 గజాల ఇంటి స్థలం కోసం ప్రత్యేకమైన మంత్రివర్గ ఉపసంగ కమిటీ వేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులను గత ప్రభుత్వం గుర్తించలేదని తద్వారా ఉద్యమకారులు తీవ్రంగా నష్టపోయారని చాలామంది ఉద్యమకారులకు ఆరోగ్య సమస్యలు వచ్చి ఎలాంటి పనులు చేసుకోలేని స్థితిలో ఉన్నారని అలాంటి ఉద్యమకారులందర్నీ గుర్తించి రెండు వందల యాభై గజాల స్థలంతో పాటు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అన్నింటిని నెరవేర్చాలని కోరారు. త్వరలో అన్ని జిల్లాలలో పర్యటించి ఉద్యమకారులను కలుస్తానని పిడమర్తి రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్స్ డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, ఉద్యమకారులు నక్క మహేష్ జోగు గణేష్ మీసాల పాల్గొన్నారు

# ఈవీఎం టాంపరింగ్ ఆరోపణలపై దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం

## గంగారం గ్రామంలో పౌరుల స్పీడ్‌పోస్ట్ లేఖల కార్యక్రమం

**సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..**



బీహార్ ఎన్నికల ఫలితాలు ఈవీఎంలలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించాలని కోరుతూ దేశవ్యాప్తంగా ఉద్యమం ఊపందుకుంటోంది. ఈ క్రమంలో శుక్రవారం సంగారెడ్డి జిల్లా గంగారం గ్రామంలో సుమారు వంద మంది పౌరులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కలిసి గౌరవ భారత ప్రధాన న్యాయమూర్తి గారికి స్పీడ్‌పోస్ట్ ద్వారా లేఖలు పంపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈవీఎంలలో అవకతవకలు జరిగితే వాటికి సంబంధించిన ఆధారాలు ఎన్నికల్లో ఉపయోగించిన యంత్రాల్లోనే లభ్యమవుతాయని, అవి తిరిగి ఎన్నికల సంఘం వద్దకు చేరగానే ఆధారాలు చెరిగిపోయే అవకాశం ఉందని లేఖల్లో పేర్కొన్నారు. అందుకే ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎంలను భారత సైన్యం ఆధీనంలో భద్ర పర్యవేక్షణకు అప్పగించి, స్వతంత్రంగా ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శకత, నిష్పక్షపాతత కోసం ఈ చర్యలు అత్యవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యాచరణను దేశవ్యాప్తంగా విస్తరించాలని యువత ముందుకొచ్చింది. ఒక్క గ్రామంలోనే వందల సంఖ్యలో లేఖలు పంపగలిగితే, దేశవ్యాప్తంగా అమలు చేస్తే కోట్ల సంఖ్యలో లేఖలు వెళ్లి, ఫోరెన్సిక్ పరీక్షల ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావచ్చని వారు పేర్కొన్నారు. దోషులు ఉంటే శిక్ష పడేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, తద్వారా ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ఉద్యమం దేశవ్యాప్త రూపం దాల్చనుందని పాల్గొన్నవారు విశ్వాసం వ్యక్తం చేశారు. గౌరవ భారత ప్రధాన న్యాయమూర్తి గారికి పంపుతున్న స్పీడ్‌పోస్ట్ కవర్లతో వందల మంది ప్రజలు ఒకే స్వరంతో తమ ఆవేదనను తెలియజేయడం ద్వారా ఇది జాతీయ స్థాయిలో చర్చకు దారి తీస్తుందని పేర్కొన్నారు. ఈవీఎంలపై ఉన్న అనుమానాలను తొలగించేందుకు, అవసరమైతే పాత బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించాలని, ఇందుకు భారత సుప్రీంకోర్టు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పౌర సమాజానికి చెందిన నేటివ్ ఇండియా ఫోరమ్ జాతీయ అధ్యక్షులు బీరయ్య యాదవ్, స్థానిక నేటివ్ ఇండియా ఫోరమ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బత్తుల విక్రమ్, సద్దాం హుస్సేన్, తాజా మాజీ సర్పంచ్ వి. నర్సిములు, కే. నాగేందర్, సాజీద్, రాంచందర్, ఆనంద్ సార్, వి. భాస్కర్, జంగం భద్రయ్య స్వామి, మంగళి ప్రభు, బి. ప్రవీణ్ కుమార్, ఎస్. బాబూరావు,బి.ఉదయ్ కిరణ్, ప్రజ్యోత్ కుమార్, వి ప్రవీణ్ కుమార్, అంజద్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు. గంగారం గ్రామానికి చెందిన చిన్నలు, పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ ఉద్యమం కొనసాగుతుందని నిర్వాహకులు స్పష్టం చేశారు.

# విపత్తు సమయంలో అవసరమైన సేవలు

## విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై 22న ప్రయోగాత్మకంగా మాక్ ఎక్సర్ సైజ్... పి .ప్రావీణ్య ,జిల్లా కలెక్టర్

**సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..**

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై ఈ నెల 22వ తేదీన జిల్లాలో




ప్రయోగాత్మక రీతిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న టేబుల్ టాప్ (మాక్) ఎక్సర్ సైజ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక, ప్రమాదాలు,వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం నివారించేందుకు చేపట్టాల్సిన తక్షణ చర్యలపై సన్నద్ధతను పెంపొందించేందుకు వీలుగా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ(నేషనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22న అన్ని జిల్లాలలో మాక్ ఎక్సర్ సైజ్ ను నిర్వహించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్ లోని టీ.జీ.ఐ.సి.సి.సి నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



రామకృష్ణారావు ఎన్.డీ.ఎం.ఎ మేజర్ సుధీర్, ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ హసనైన్, తెలంగాణ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణరావు, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ ఇతర ఉన్నథాధికారూలతొ కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాక్ ఎక్సర్ సైజ్ చేపట్టాల్సిన ఆవశ్యకత గురించి తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీ.ఎస్, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాలలో అనుకోని ప్రమాదాలు సంభవిస్తే అవసరమైన సహాయక చర్యలు చేపట్టడానికి పరిశ్రమల శాఖ, అగ్నిమాపక శాఖ వైద్య ఆరోగ్య శాఖ రెవెన్యూ పోలీస్ యంత్రాంగంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని భారీ మధ్యతర సూక్ష్మ పరిశ్రమలలో ఆయా పరిశ్రమల స్థాయిలకు అనుగుణంగా భద్రతా ప్రమాణాలు పాటించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పరిశ్రమలలో ప్రమాదాల నివారణ కోసం తరచూ అధికారుల బృందాలు పరిశ్రమలను తనిఖీ చేస్తూ అవసరమైన భద్రతా ప్రమాణాలు పరిశ్రమంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు, ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభించి ఆస్తి, ప్రాణ నష్టాలు జరుగకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు పారిశ్రామిక ప్రాంతాలలో చేపట్టినట్లు తెలిపారు.ఎస్.డీ.ఆర్.ఎఫ్ బృందాలు తక్షణ సహాయక చర్యలు చేపట్టడం, అంబులెన్సులు, అందుబాటులో ఉంచడం, రెస్క్యూ టీంలు, మెడికల్ టీంలను ఏర్పాటు చేయడం, ఇతర సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టినట్లు తెలిపారు . విపత్తులు సంభవించిన సమయంలో సమర్ధవంతంగా ఎదుర్కొనేలా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ విపత్తుల నిర్వహణపై చేపట్టనున్న మాక్ ఎక్సర్ సైజ్ కార్యక్రమం ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు . ఈ నెల 22వ తేదీ నాటి మాక్ ఎక్సర్ సైజ్ సందర్భంగా ఈ తరహా అన్ని చర్యలు ప్రయోగాత్మకంగా చేపట్టేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పలు పరిశ్రమలలో ప్రమాదాలు చోటుచేసుకుని మరణాలు సంబంచించడం ,వంటి విపత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విపత్తుల నిర్వహణ విషయంలో అప్రమత్తతను పెంపొందించేందుకు 22న మాక్ ఎక్సర్ సైజ్ నిర్వహించాలని ఆదేశించిందని అన్నారు. ఇది ప్రయోగాత్మక కార్యక్రమం అయినప్పటికీ పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ,అధికారులను ఆదేశించారు. మాక్ ఎక్సర్ సైజ్ ను నిర్వహించడం వల్ల విపత్తులను ఎదుర్కొనే విషయంలో ఏ మేరకు సన్నద్ధత కలిగి ఉన్నామనే విషయం వెల్లడి అవుతుందని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరి చేసుకునేందుకు, అవసరమైన పరికరాలను సమకూర్చుకునేందుకు అవకాశం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత శాఖల అధికారులు అందరూ మాక్ ఎక్సర్ సైజ్ ను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. విపత్తుల సమయంలో నీటిపారుదల, అగ్నిమాపక, విద్యుత్, రహదారుల, పోలీస్, రెవెన్యూ, వైద్య, పౌరసరఫరాల తదితర శాఖల అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ మాధురి , జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ , ఎస్పీ రఘునందన్ రావు , జి ఎం , డి ఐ సి తుల్జా నాయక్ , జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు , డి టి ఓ అరుణ , కలెక్టరేట్ విపత్తుల నిర్వహణ విభాగం పర్యవేక్షకుడు లింగ శేఖర్ , ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, వైద్యారోగం, పోలీస్, మున్సిపల్ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అమెరికా లో గుర్తు తెలియని దుండగుల చేతిలో కల్పులకు గురై మరణించిన పోలే చంద్రశేఖర్ కుటుంబానికి అందించడానికి గోఫండ్ ద్వారా 50 లక్షల సేకరణ:

## ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి హరీష్ రావు:

**హైదరాబాద్: డిసెంబర్ 19,( అక్షర కలం న్యూస్):**

గత అక్టోబర్ 4న అమెరికా డల్లాస్ నందు చదువు నిమిత్తం బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ నందు నివాసం ఉంటున్న పోలే.చంద్రశేఖర్ గారిని గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో చంద్రశేఖర్ మరణించిన విషయం తెలిసిందే.అయితే అప్పుడు అట్టి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వర్యులు శ్రీ.హరీష్ రావు మరియు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు సుధీర్ రెడ్డి బాధితుని ఇంటికి వెళ్లి వారి యొక్క కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి చొరవతో మృతదేహాన్ని ఇండియాకు త్వరగా తీసుకొనిరావడం జరిగింది. విదేశాలలో చనిపోయిన అనేక మంది భారతీయులను స్వదేశానికి రప్పించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదే అని హరీష్ రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు .దానిలో బాగంగా సుధీర్ రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు తగు నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో సుధీర్ రెడ్డి గారి వినతి మేరకు అక్కడ ఉంటున్న ఆటా(అమెరికన్ తెలుగు అసోసియేషన్) సభ్యులు తప్పకుండా మా వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపిన నేపథ్యంలో గోఫండ్ కార్యక్రమంలో భాగంగా దాదాపు యాబై లక్షల రూపాయల వరకు సేకరించడం జరిగింది అని ఆటా అధ్యక్షులు జయంత్ చెల్లా , మరియు కాబోయే ఆట అధ్యక్షులు సతీశ్ రెడ్డి తెలిపారు.దానిలో భాగంగా ఈ రోజు సుధీర్ రెడ్డి గారి నివాసానికి వచ్చిన ఆట సభ్యులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.సుధీర్ రెడ్డి చొరవ వల్లే ఇంత డబ్బులు సేకరించడం జరిగింది అని తెలిపారు.అతి త్వరలో అట్టి డబ్బులు బాధిత కుటుంభసభ్యులకు అందజేయడం జరుగుతుంది అని హామీ ఇచ్చారు.అనంతరం బాధిత సభ్యులు మాట్లాడుతూ సుధీర్ రెడ్డి గారి చొరవ వల్లే మృతదేహం త్వరగా ఇండియాకు తీసుకొనిరావడం జరిగింది అని తెలిపారు.అలాగే మాకు ఆర్థికసాయం అందించడానికి కృషి చేసిన సుధీర్ రెడ్డి గారికి మరియు ఆట సభ్యులకు మా యొక్క ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో బాధిత తల్లి సునీత,గుంటి రాజు,దామోదర్,రాజ్ కిరణ్,శివ ముదిరాజ్ మరియు పలువురు ఆట సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# బెల్ట్ షాపులు పై ఎక్సైజ్ వారు కఠిన చర్యలు తీసుకోవాలి.. సాధన పల్లి సతీష్ డిమాండ్




**అక్షర కలం/భద్రాచలం**

ఈరోజు స్థానిక భద్రాచలం పట్టణం లో గల సిపిఐ డివిజన్ కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ న్యాయవాది సాధన పల్లి సతీష్ పాల్గొని మాట్లాడుతూ భద్రాచలం పట్టణంలో విచ్చలవిడిగా పట్టణ శివారు కాలనీలలో గంజాయి తాగుతున్న బ్యాచ్లు ఎక్కువయ్యాయని అదే విధంగా పట్టణంలో బెల్ షాప్ లో అధికంగా ఉన్నాయని వీటివల్ల యువత మద్యం మత్తులో మునిగిపోయి హత్యలు చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా ఇటీవల కాలంలో భద్రాచలంలో హత్యలు చేయడం ఎక్కువయ్యాయని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. మద్యం సేవించినవాడు గంజాయి సేవించినా వారు ఏ విధంగా ఏ సమయంలో ఎక్కడ ప్రజలపై విరుచుకుపడతారు అని అని భద్రాచలం పట్టణంలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ బయటికి రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి అని అన్నారు. భద్రాచలం పట్టణ పోలీసులు బృందాలుగా విడిపోయి శివారు కాలనీలలో గంజాయి మత్తుకి బానిసైన యువకులను గుర్తించి వారికి సరైనటువంటి కౌన్సిలింగ్ ఇచ్చి వారి తల్లిదండ్రులను కూడా కౌన్సిలింగ్ ఇవ్వాలని పోలీసు వారిని కోరారు. అదేవిధంగా హత్య చేసిన వారికి జిల్లా స్థాయిలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి త్వరగా విచారణ జరిపించి వారికి కఠినంగా శిక్ష పడేలా చూడాలని న్యాయస్థానాలను కోరారు. అధికారులు కాలనీలో ఉన్నటువంటి నిరుద్యోగ యువత ను గుర్తించి వారు చెడు వ్యసనాలకు బానిసలు అవ్వకుండా వారికి కౌన్సెలింగ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు కృషి చేయాలని కోరారు. పట్టణంలో అక్రమంగా బెల్ట్ షాపులు నడిపే వారిపై పోలీసులు ,ఎక్సైజ్ వారు కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కొక్కిరేణి అశోక్ కుమార్, ఏ ఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నారపొంగు రమేష్, పట్టణ నాయకులు పసుపులేటి సాయి, ఏఐవైఎఫ్ నాయకులు చీదరగడ్డ శేఖర్, క్రాంతి కుమార్ అభి ,మహేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజల ఆకాంక్ష మేరకు పనిచేయండి- మంత్రి తుమ్మల.

ప్రభుత్వపరంగా ఏ సహాయం కావాలన్నా మీకు నేను అండగా ఉంటా..

ఎన్నికైన నూతన సర్పంచుల అభినందన కార్యక్రమంలో వ్యవసాయ, సహకార జవ్వీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ...



**అక్షర కలం/ సత్తుపల్లి**

పదవి ఒక వరం అని ప్రజలు నమ్మకంతో మిమ్మల్ని గెలిపించారని వారి ఆకాంక్షకు అనుగుణంగా పని చేసి గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు సత్తుపల్లి మండల పరిధిలోని పాకలగూడెం గ్రామ పంచాయతి పరిధిలోని గల తన వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన నూతన సర్పంచుల అభినందన కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్ అభ్యర్థులకు పలు సూచనలు చేశారు సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా గెలిచిన సర్పంచ్ అభ్యర్థులను మంత్రి తుమ్మల ఘనంగా సన్మానించారు మీ గ్రామాల అభివృద్ధి విషయంలో ప్రభుత్వపరంగా ఎలాంటి నిధులు కావాలన్నా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తనకు రాజకీయ జన్మనిచ్చిన సత్తుపల్లి నియోజకవర్గం అభివృద్ధిలో ముందు ఉండాలని అది తన ఆకాంక్ష కోరిక అని మంత్రి తుమ్మల తెలిపారు ప్రజల మన్ననలు పొందితే సుదీర్ఘకాలం రాజకీయాల్లో మనుగడ ఉంటుందని అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడవద్దని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ తో పాటు సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తుమ్మల అభిమానులు పాల్గొన్నారు.

# అంబటి సతీష్ పార్థీవ దేహానికి మండల పార్టీ అధ్యక్షులు పులి సైదులు ఘన నివాళి

**ఇల్లందు / అక్షర కలం.**

ఇల్లందు మున్సిపల్ పరిధిలోని మూడో వార్డు కు చెందిన అంబటి సతీష్ శుక్రవారం ఆకస్మింగ మరణించారు ఈ విషయం తెలుసుకున్న ఇల్లందు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పులి సైదులు శుక్రవారం మృతుడు అంబటి సతీష్ స్వగృహమునకు వెళ్లి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి కాంగ్రెస్ పార్టీ తమ కుటుంబానికి అండగా ఉంటామని అధైర్య పడవద్దు అని నేతలు హామి ఇచ్చారు.



# అప్రమత్తతో సైబర్ నేరాలకు ఫుల్ స్టాప్ పెట్టాలి....

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఫోన్ నెంబర్, వ్యక్తిగత వివరాలు బయట ఇవ్వవద్దు

సైబర్ మోసాల పట్ల విస్తృత ప్రచారం కల్పించాలి

సైబర్ క్రైమ్ నియంత్రణపై






నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

సాంకేతికత అభివృద్ధి చెందుతున్న నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సైబర్ క్రైమ్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ నందు అధికారులు, సిబ్బందికి సైబర్ క్రైమ్ నియంత్రణపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ జరగకుండా ఉండేందుకు సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పెరుగుతున్న సాంకేతికతతో నేరాల ప్రవృత్తి మారుతున్నదని, ప్రతి ఒక్కరికి సాంకేతికత అందుబాటులోకి రావడం వల్ల కొంత మంది వాటిని దుర్వినియోగం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఫోన్ వాడకంలో మనం అప్రమత్తంగా ఉండాలని, బహుమతులు గెలిచారు, రుణం మంజూరైందని, డిస్కౌంట్, వ్యాపారాల రిటర్న్, ప్లాట్ ల విక్రయం మొదలగు వైవిధ్యమైన కారణాలతో పంపే ఎటువంటి లింక్ లను క్లిక్ చేయవద్దని కలెక్టర్ సూచించారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ కాల్ చేసే మోసగాళ్లకు ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత వివరాలు, ఓటిపి తెలియజేయరాదని అన్నారు. సైబర్ నేరాలలో అధికంగా బాగా చదువు కున్నవారు చిక్కుకుంటున్నారని, ఆన్ లైన్ గేమింగ్ లో చాలా మంది డబ్బులు పెట్టి మోసపోతున్నారని కలెక్టర్ తెలిపారు. షాపింగ్ చేసే సమయంలో మన ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్, వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వవద్దని కలెక్టర్ సూచించారు. మనం ఫోన్ బ్యాంకు లాగా మారి పోయిందని, నేటి సమాజంలో అధికంగా బ్యాంకుకు వెళ్లే అవసరం ఉండటం లేదని, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలు ఫోన్ లో ఉన్నప్పుడు మనం అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా ఫోన్ వివరాలు ఇవ్వవద్దని అన్నారు. మనం ఫోన్ లో ముఖ్యమైన పాస్ వర్డ్ లను రెగ్యులర్ గా మారుస్తూ ఉండాలని అన్నారు. ఫోన్ లో సులువైన పాస్ వర్డ్ పెట్టుకోవద్దని అన్నారు. మనం ఇతరులకు ఫోన్ ఇవ్వవద్దని, ఇంట్లో పిల్లలకు ఇచ్చే సమయంలో మన పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, చుట్టుపక్కల ప్రజలకు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఉద్యోగులతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సైబర్ క్రైమ్ నియంత్రణకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో సైబర్ క్రైమ్ అడిషనల్ ఎస్పీ జి. బిక్షం రెడ్డి, డి ఎస్.పి సి.హెచ్. ఆర్.వి. ఫణీందర్, సిఐ కే. నరేష్, డి.ఆర్.ఓ. ఏ. పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ లోని వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అద్భుతమైన ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఇచ్చేది యోగ

డిసెంబర్ 21 ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని విజయవంతం చేయండి

డిసెంబర్ 21న జిల్లా పరిషత్ లో ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు

ఖమ్మం యోగ ధ్యాన సమాఖ్య కన్వీనర్ వంజాకు లక్ష్మీనారాయణ







**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం, ఉచితమైన ధ్యానం, యోగా ద్వారా అద్భుతమైన ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పొందవచ్చని ఖమ్మం యోగ ధ్యాన సమాఖ్య కన్వీనర్ వంజాకు లక్ష్మీనారాయణ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం డిసెంబర్ 21న ధ్యాన దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటామన్నారు. అందులో భాగంగానే ఖమ్మం నగరంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు ధ్యానం, యోగ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను ఆహ్వానించినట్లు తెలిపారు. డిసెంబర్ 21 సంవత్సరంలో అతి చిన్న పగలు, అతి పెద్ద రాత్రి కలిగిన రోజు అన్నారు. ఈ ప్రకృతి మార్పు మనకు అంతర్ముఖత, ఆత్మపరిశీలన, సమతుల్యత అనే విలువలను గుర్తు చేస్తుందన్నారు. ధ్యానం అనేది వేల సంవత్సరాల నాటి ప్రాచీన సాధన అని, ఇది మన మనస్సును ప్రశాంతంగా ఉంచి, ఆలోచనలకు స్పష్టతనిస్తూ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో మనుషులు ఒత్తిడి, ఆందోళన, మానసిక అలసటతో బాధపడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ధ్యానం మనకు మనస్సు ప్రశాంతత, భావోద్వేగ నియంత్రణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అందిస్తుందన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవంను పురస్కరించుకుని ప్రజల్లో మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం, ధ్యాన ప్రాముఖ్యతను విస్తృతంగా చాటి చెప్పడ మన్నారు. ధ్యానం ఏ మతానికి, కులానికి, దేశానికి పరిమితం కాదని, ఇది సర్వమానవీయ సాధన అన్నారు. ప్రతిరోజూ కొద్ది నిమిషాలు ధ్యానం చేయడం ద్వారా మన ఆలోచనలు శుద్ధమవుతాయి, జీవితం పట్ల దృష్టికోణం మారుతుందన్నారు. డిసెంబర్ 21న అనేక సంస్థలు, ఆశ్రమాలు, విద్యాసంస్థలు ధ్యాన శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, ఉపన్యాసాలు నిర్వహిస్తాయన్నారు. వ్యక్తిగత శాంతి ద్వారా కుటుంబ శాంతి, సమాజ శాంతి, చివరకు ప్రపంచ శాంతి సాధ్యమవుతుందనే సందేశాన్ని ఈ రోజు మనకు గుర్తు చేస్తుందన్నారు. నిజమైన శాంతి బయట కాదు ? మన అంతరంగంలోనే ఉందన్నారు. ధ్యానం మనకు ఆ అంతరంగ శాంతిని చేరువ చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని జీవన భాగంగా మార్చుకుంటే ఆరోగ్యవంతమైన, శాంతియుతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఆయుష్ డిపార్ట్మెంట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ బాబు నాయక్, కో-కన్వీనర్, పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ డైరెక్టర్ కాశిన ఆనంద్ ప్రసాద్, గురుదక్షిణ ఫౌండేషన్ సీతారాములు, రామచంద్ర మిషన్ వరలక్ష్మి, బ్రహ్మకుమారి రమాదేవి, గోదాదేవి పిరమిడ్ నిర్వాహకులు జంజీరాల వెంకట రాములు, పతాంజలి యోగ సెంటర్ కొదుమూరు సురేష్, సర్దార్ పటేల్ స్టేడియం మెడిటేషన్ సెంటర్ నిర్వాహకులు చావ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త సర్పంచులకు, వార్డు మెంబర్లకు శుభాకాంక్షలు తెలిపిన....- మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు బుడ్డ భాగ్యరాజ్..

**మెదక్, డిసెంబర్19(అక్షరకలం):-**

గత మూడు విడుతలుగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందినకొత్త సర్పంచులు వార్డు సభ్యులకు శుభాకాంక్షలు మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ మెదక్ జిల్లా చేగుంట మండలంలోని కాంగ్రెస్ పార్టీ తరపున ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన నూతన సర్పంచులు వార్డు సభ్యులకు శుక్రవారం రోజున జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ గారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని గ్రామాల ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందిన ప్రతినిధులు గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను మరింత పెంచాలని ఆయన ఆకాంక్షించారు. విజయం సాధించిన ప్రతి సర్పంచ్ మరియు వార్డు సభ్యులు పేరుపేరునా ఆయన అభినందనలు తెలియజేశారు.



# తెలంగాణ నుంచి గల్ఫ్ కు 50వేల మంది కార్మికులు..

2020?25లో దేశవ్యాప్తంగా 21 లక్షలకు

పైగా ఎమిగ్రేషన్ క్లియరెన్సులు

యూఏఈ, సౌదీ అరేబియాలే రాష్ట్ర కార్మికుల ప్రధాన గమ్యస్థానాలు

వాయు కాలుష్య మరణాలపై స్పష్టమైన ఆధారాలు లేవన్న కేంద్రం

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ప్రశ్నలకు

లిఖితపూర్వక సమాధానాలు ఇచ్చిన కేంద్ర మంత్రులు



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

విదేశీ ఉపాధి కోసం గల్ఫ్ దేశా4లకు వెళ్లే కార్మికుల్లో తెలంగాణ కీలకంగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. 2020 నుంచి 2025 డిసెంబర్ 9 వరకూ తెలంగాణ నుంచి మొత్తం 49,879 ఎమిగ్రేషన్ క్లియరెన్స్‌లు (ఈసీ లు) జారీ అయ్యాయని కేంద్రం లోక్‌సభలో తెలిపింది. ఈ అంశాన్ని పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి గురువారం లేవనెత్తారు. దీనికి కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశంలో వాయు కాలుష్యం మరణాలకు సంబంధించి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సమాధానం తెలిపారు. తెలంగాణ నుంచి విదేశాల్లో ఉన్న వలస కార్మికుల సంఖ్య ఇలా..తెలంగాణ నుంచి అత్యధికంగా యూఏఈ 18,585 మంది కార్మికులు ఉన్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి తెలిపారు. ఆ తర్వాత సౌదీ అరేబియాలో (11,081), ఒమాన్ (5,910), ఖతార్ (5,304), కువైట్ (4,274) దేశాలు ఉన్నాట్లు పేర్కొన్నారు. ప్రధానంగా నిర్మాణ, సేవారంగాలు, పారిశుధ్య, రవాణా రంగాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణమని కేంద్రం వివరించింది. వలస కార్మికుల్లో పురుషులే అధికంగా ఉన్నారని, మహిళల సంఖ్య పరిమితంగానే ఉందని తెలిపారు. కార్మికుల భద్రత, హక్కుల పరిరక్షణకు దౌత్య కార్యాలయాల ద్వారా పరిరక్షణవిదేశీ ఉపాధికి వెళ్లే తెలంగాణ కార్మికుల భద్రత, హక్కుల పరిరక్షణ కోసం ఇ–మైగ్రేట్ పోర్టల్, భారత దౌత్య కార్యాలయాల హెల్ప్‌లైన్లు, ప్రవాసీ భారతీయ సహాయ కేంద్రాలు పనిచేస్తున్నాయని కేంద్రం పేర్కొంది. విదేశాలకు వెళ్లే ముందు అవగాహన శిక్షణ, ఒప్పందాల పరిశీలన, బీమా సదుపాయాలు కల్పిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. దేశంలో వాయు కాలుష్య మరణాలకు సంబంధించి.. ప్రజారోగ్యానికి సంబంధించి దేశంలో వాయు కాలుష్య తీవ్రత, మరణాల గురించి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ సమాధానం ఇచ్చారు. దేశంలో వాయు కాలుష్యం ( పిఎం2.5) వల్లే మరణాలు సంభవిస్తున్నాయని నిర్ధారించే స్పష్టమైన, తుది ఆధారాలు లేవని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. గాలి కాలుష్యం ఆరోగ్యంపై ప్రభావం చూపే అంశాల్లో ఒకటేనని, అయితే ఆహారపు అలవాట్లు, వృత్తి సంబంధిత పరిస్థితులు, సామాజిక?ఆర్థిక స్థితి, వైద్య చరిత్ర, రోగనిరోధక శక్తి, వారసత్వ లక్షణాలు వంటి పలు అంశాల సమ్మేళనంతోనే వ్యాధులు, మరణాలు సంభవిస్తాయని వివరించారు.

# యశోద హాస్పిటల్ లో అడ్వాన్స్డ్ రోబోటిక్ సర్జరీ విజయవంతం

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:ఖమ్మం :

యశోద హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ సర్జికల్ ఆంకాలజీ & అడ్వాన్స్డ్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ సచిన్ మార్ద ( యశోద హాస్పిటల్ సోమాజిగూడ ) మాట్లాడుతూ ఖమ్మం పోలిశెట్టి గూడెం ప్రాంతానికి చెందిన రమేష్ వయసు 44 సంవత్సరాలు . గొంతు నొప్పితో మాట్లాడలేకపోవడం , మింగ లేకపోవడం జరిగింది . ఇలాంటి పరిస్థితుల్లో యశోద హాస్పిటల్ ను సంప్రదించగా ప్రొవాక్స్ ప్రొస్థసిస్ ద్వారా పరీక్షించగా పేషెంట్ రమేష్ కు గొంతు దగ్గర పెద్ద ట్యూమర్ వచ్చిందని దానిని స్వర పేటిక క్యాన్సర్ గా నిర్ధారించడం జరిగిందని పేర్కొన్నారు . ఇలాంటివి ప్రపంచంలో అరుదుగా వస్తాయని అన్నారు . వీటికి అరుదైన శాస్త్ర చికిత్స అందించవచ్చని తెలిపారు . కొత్త టెక్నాలజీని ఉపయోగించి కృత్రిమ స్వర పేటికను తయారు చేయవచ్చు . దానిని గొంతు స్వర పేటిక దగ్గర ఒక హోల్ పెట్టి దాని ద్వారా ఈ కృత్రిమ స్వర పేటికను పంపించి ఇంపోర్టెడ్ తో సర్జరీ చేయడంవల్ల స్వరం వస్తుంది . ఆ తర్వాత కి తినవచ్చు , మాట్లాడవచ్చు . ఇది ఒక మిరాకిల్ గా భావించవచ్చు . చెడు అలవాటులకు దూరంగా ఉండాలి . క్యాన్సర్ కి చికిత్స ఉంది జీవిత కాలం పొడిగించవచ్చు అని అన్నారు . గతంలో కోదాడ వాసి సతీష్ అనే పేషెంట్ కు నాలుక దగ్గర క్యాన్సర్ వచ్చింది . అతనికి నాలుగు సంవత్సరాల క్రితం నాలుక భాగం దగ్గర సర్జరీ సమయంలో అవసరమైన బాగాని తొలగించి కొత్త ఫ్లాస్టిక్ సర్జరీ ద్వారా అతికించడం జరిగింది . ఇంకా రేడియేషన్ కూడా అయింది . అతను తినడం మాట్లాడడం చాలా బాగా చేయగలుగుతున్నారు . యశోద హాస్పిటల్ లో



రొమ్ము పునర్నిర్మాణం ( పునః నిర్మాణం ) , రోబోటిక్స్ , రేడియేషన్ థెరపీ , ఐఎంఆర్టి , ఎం ఆర్ ఎల్ ఐ ఎన్ ఏ సి థెరపీ , ఐ జి ఆర్ టి , మెడికల్ ఆంకాలజీ కీ మో థెరపీ వంటి అత్యుత్తమ అరుదైన శాస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు . క్యాన్సర్ అవగాహన కొరకు వి యామ్ అన్ స్టాపబుల్ టుగెదర్ వి విన్ అనే బుక్ ను ప్రింట్ చేయడం జరిగిందని , దీనిలో పేషెంట్ మోటివేషన్ స్టోరీలు , జనరల్ అవేర్ నెస్ , ముందు జాగ్రత్తలు , న్యూట్రిషన్ , వివిధ రకాల పేషెంట్లకు ఉపయోగపడే విషయాలను రూపొందించడం జరిగిందని అన్నారు . ఈ బుక్ ను పేషెంట్ ఫ్యామిలీకి అందించారు . ఈ కార్యక్రమంలో ఓటీ శ్రీధర్‌రావు మార్కెటింగ్ డిప్యూటీ మేనేజర్ మరియు పేషెంట్ భార్య పాల్గొన్నారు .



# బిఆర్ఎస్ మాజీ వార్డ్ మెంబర్ నీలం రాజశేఖర్‌పై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను కఠినంగా శిక్షించాలి






## దిండిగాల రాజేందర్, శీలం రమేష్, కంభంపాటి రేణుక.

ఇల్లందు /అక్షర కలం.

మండలంలోని ఇందిరానగర్ గ్రామపంచాయతీ జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిని పాయం లలితకు స్వల్ప మెజార్టీ రావడానికి, ఎనిమిదో వార్డులో తమ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడిపోవడానికి బిఆర్ఎస్ అభ్యర్థిని గెలుపుకు కారకుడని కక్ష కట్టిన కాంగ్రెస్ గుండాలు నాలుగో వార్డ్ లో ఓడిపోయిన బి ఆర్ఎస్ సోషల్ మీడియా క్రియాశీలక కార్యకర్త మాజీ వార్డ్ మెంబర్ నీలం రాజశేఖర్ ను 18వ తేదీ రాత్రి 10 గంటలకు ఇంటి నుండి గుంజుకొచ్చి ఇష్టం వచ్చినట్టు రక్తం కారేటట్లు కొట్టారని ఈ సంఘటనపై స్థానిక పోలీసులు స్పందించి కాంగ్రెస్ గుండాలపై తగు చర్యలు తీసుకోవాలని బాధితుడికి ప్రాణ రక్షణ కల్పించాలని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు దిండిగాల రాజేందర్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం రమేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కంభంపాటి రేణుక పోలీసులను డిమాండ్ చేశారు. బాధితుడికి న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో జగదాంబ సెంటర్లోని తెలంగాణ తల్లి విగ్రహం దగ్గర నుండి స్థానిక పోలీస్ స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. బాధితుడు నీలం రాజశేఖర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో ప్రజాస్వామ్యం పై విశ్వాసంతో గులాబీ సైనికులు అందరూ ఒక త్రాటిపై వచ్చి ఎన్నికలలో పోటీ చేశామని ఎంతో కొంత సఫలీకృతం అయ్యామని వారు అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓడిపోవడానికి తక్కువ మెజార్టీ రావడానికి బిఆర్ఎస్ నాయకుడు నీలం రాజశేఖర్ కారణమని ఎన్నికలు ముగిసిపోయాక మరుసటి రోజు రాత్రి 10 గంటలకు అతని ఇంటికి వెళ్లి ఇంట్లో నుండి గుంజుకొచ్చి కొట్టడం మారణాయుధాలతో అక్కడున్న వారిని భయభ్రాంతులకు గురిచేయడం వంటి పరిస్థితులు చూస్తా ఉంటే ఇది రౌడీ రాజ్యమా లేక ప్రజాస్వామ్యమా అర్థం కావడం లేదని వారు అన్నారు. ఇట్లాంటి నేపథ్యం ఉన్న వారి విషయంలో కాంగ్రెస్ నాయకత్వం స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇల్లందు నియోజకవర్గంలో ఇట్లాంటి సాంస్కృతి ఇక్కడ ఇంత కు ముందు ఎప్పుడు లేదని ఇలాంటి సాంస్కృతి మంచిది కాదని కొత్త సాంస్కృతికి ఆజ్యం పోసే వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సంఘటన వ్యక్తిగతంగా చేశారా పార్టీ పరంగా చేశారా ? ఏ రకంగా చేసిన వ్యక్తిగత హింసకు తావు లేదని వారు పేర్కొన్నారు. నీలం రాజశేఖర్ కు న్యాయం జరిగే విధంగా స్థానిక పోలీసు అధికారులు స్పందించి తగు సెక్షన్లతో కాంగ్రెస్ గుండాలపై కేసులు పెట్టి శిక్షించాలని వారు కోరారు. లేని పక్షంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వాన్ని ఇక్కడకు రప్పించి బాధితుడు రాజశేఖర్ కు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని తెలిపారు. గులాబీ సైనికులంతా ఒక్క త్రాటిపై ఉన్నామని కొడితేనో బెదిరిస్తేనో దౌర్జన్యం చేస్తేనో బెదిరే పరిస్థితి లేదని, ఇది అంతం కాదు ఆరంభమేనని వారు అన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులు సమంజసం కాదని వ్యక్తిగత హింస ద్వారా సాధించేది ఏమీ ఉండదని వారు తెలిపారు. మేము కేసీఆర్ బిడ్డలమని ఇంకొకసారి ఈ విధంగా కొట్టి, భయపెట్టిస్తే, ఊరుకోమని బిఆర్ఎస్ కార్యకర్తలపై చేయిచేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని కాంగ్రెస్ గుండాల్లారా ఖబర్దార్ అని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జబ్బార్, జి బి జి కె ఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సుదర్శన రంగనాథ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం రమేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కంభంపాటి రేణుక, బిఆర్ఎస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ, ఇల్లందు మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు సిలివేరు సత్యనారాయణ, జె కే శ్రీను, కటకం పద్మావతి, రవితేజ స్వామి, మాజీ వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్ కుమార్, సోషల్ మీడియా ఇన్చార్జ్ గిన్నారపు రాజేష్, పట్టణ సీనియర్ నాయకులు దేరంగుల పోశం, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిలాల్ నాయక్, ఘాజీ, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఇందిర నగర్ గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన నాపై, నా కుటుంబ సభ్యులపై తప్పుడు ప్రచారాలను, తప్పుడు కేసులను టిఆర్ఎస్ పార్టీ నేతలు పెట్టడాన్ని ఖండించండి.

ఇందిరానగర్ గ్రామ సర్పంచ్ పాయం లలిత.

ఇల్లందు / అక్షర కలం.

బిఆర్ఎస్ పార్టీ మండల పార్టీ కార్యకర్త నీలం రాజశేఖర్, బి ఆర్ఎస్ మండల పార్టీ నేతలు ఆదివాసి సర్పంచ్ నైన నాపైతక్కు నా భర్త హత్యకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజాస్వామ్యవాదులైన వారందరూ ఖండించాలని ఆమె కోరారు. ఇల్లందు మండల బి ఆర్ఎస్ మండల నాయకురాలు ఖమ్మంపాటి రేణుక, ఆమె భర్త కంభం పాటి నరసింహారావు (ప్రభుత్వ ఉద్యోగి) ఇందిరానగర్ నివాసుల అందితో, నూతనంగా రెండవసారి ఎన్నికైన, తనను తన కుటుంబ సభ్యులను, ఇంద్రనగర్ మాజీ వార్డు మెంబర్ నీలం రాజశేఖర్ వారి అన్న నీలం రాజు మరి కొంతమంది కలిసి గత కొన్ని సంవత్సరాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని సర్పంచ్ పాయం లలిత పేర్కొన్నారు. నిన్న రాత్రి ఇంద్ర నగర్ లో మాజీ వార్డు సభ్యులు నీలం రాజశేఖర్,సతీష్ ఘర్షణ పడి పడుతుంటే, వారు కొట్టుకుంటున్న విషయంలో, నా భర్త కాంగ్రెస్ పార్టీ నాయకులు కకాటి భార్గవ్ పెద్దమనిషిగా వెళ్లి గొడవలు జరగకుండా వారించి, వెళుతుండగా, నా భర్తను మాదిగ లంజాకొడకా అని దూషించడమే కాకుండా, నన్ను కూడా కులం పేరుతో దూషించి, నా భర్తను చంపడం కోసం ప్రయత్నించడం చేసాడు. మరల ఉదయం సుమారు 7:30, ఎనిమిది గంటల సమయంలో, నా ఇంటి పై కి దాడికి బిఆర్ఎస్ పార్టీ మండల నాయకురాలు ఖమ్మంపాటి రేణుక, ఖమ్మంపాటి నరసింహారావు ల అండతో, దాడికి ప్రయత్నించి, మమ్మల్ని చంపడం కోసం ప్రయత్నించి కులం పేరుతో దూషించిన మాజీ వార్డు సభ్యులు నీలం రాజశేఖర్, నీలం రాజు, మరియు వీరి సహకరించిన ఖమ్మంపాటి రేణుక, ఖమ్మంపాటి నరసింహారావు లపై అందరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఇల్లందు పోలీసులకు ఫిర్యాదు చేయడం ఆమె తెలిపారు. ఇంద్రనగర్ నుంచి రెండోసారి ఆదివాసి మహిళలైన నేను గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఎన్నిక కావడం పట్ల జీర్ణించుకోలేని టిఆర్ఎస్ పార్టీ నేతలు, నాపై నా భర్త పై, మా కార్యకర్తలపై టిఆర్ఎస్ పార్టీ నేతలు తప్పుడు కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అని ఆమె తెలిపారు. ఆదివాసి వర్గానికి చెందిన మహిళ ప్రజా ప్రతినిధి అయిన నాపై బి ఆర్ ఎస్ పార్టీ సోషల్ మీడియా నాయకులు తప్పుడు మెసేజ్లు పెడుతూ, తప్పుడు ప్రచారాన్ని వాట్సాప్ గ్రూప్ లలో పోస్ట్ చేస్తూ, నన్ను నా కుటుంబ పరువు పోయే విధంగా చేస్తున్న, వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని ఇల్లందు పోలీసు వారిని కోరి నట్లు ఆమె తెలిపారు.



## అవుట్ డోర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఐటిడిఏ, పి ఓ, బి.రాహుల్

అక్షర కలం/భద్రాచలం

ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియం ఆధ్వర్యంలో అవుట్ డోర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్లను ఈనెల ఇరవై మూడు,ఇరవై నాలుగో వ తేదీలలో రాత్రి ఏడు గంటలకు ఐటీడీఏ ట్రైబల్ మ్యూజియం నందు ప్రారంభించి, నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ క్రీడలలో పాల్గొనే బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎంట్రీ ఫీజు ఐదు వందల రూపాయలు చెల్లించాలని, ఎంట్రీ ఫీజు కట్టిన వారు తమ పేరుతో పాటు, తమతో పాల్గొనే పార్ట్నర్ పేరు తెలిపి, ముందు తెలిపిన పార్ట్నర్ తో మాత్రమే ఈ క్రీడలలో పాల్గొనాలని ఆయన అన్నారు. బ్యాడ్మింటన్ క్రీడలలో పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి ఎనిమిది వేల రూపాయలు,రెండవ బహుమతి ఆరు వేల రూపాయలు, మూడవ బహుమతి నాలుగు వేల రూపాయలు, చతుర్థ బహుమతి రెండు వేల రూపాయలు అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ బ్యాడ్మింటన్ క్రీడలు అవుట్డోర్ క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని, ఇండోర్ క్రీడాకారులకు పాల్గొనే అవకాశం లేదని ఆయన అన్నారు. ఆసక్తిగల బ్యాడ్మింటన్ క్రీడాకారులు తమ ఎంట్రీ ఫీజు ఈనెల ఇరవై.రెండోవ తేదీ రాత్రి పది గంటల వరకు 9948839775, 9676391061 ఫోన్ నెంబర్లకు ఫోన్ పే ద్వారా ఐదు వందల రూపాయలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలుపుతూ, ఇతర వివరములకు పై నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవాలని ఆయన కోరారు.




# బీజేపీ కి గణనీయంగా పెరిగిన ఓటు షేర్

నర్సంపేట ( డిసెంబర్ 19 ,అక్షర కలం)

నర్సంపేట నియోజకవర్గంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి , మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరుపున నర్సంపేట నియోజకవర్గంలో 72 గ్రామపంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థులుగా సుమారు 350 మంది వార్డు మెంబర్లుగా పోటీ చేయడం జరిగిందన్నారు. అందులో ఒక సర్పంచ్ అలాగే 26 మంది వార్డ్ మెంబర్లుగా గెలిచారన్నారు . అదేవిధంగా 6 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థులు రెండోవ స్థానంలో నిలిచారన్నారు .మునుపెన్నడు లేని విధంగా భారతీయ జనతా పార్టీకి నర్సంపేట నియోజకవర్గంలో ఓటు షేర్ గణనీయంగా పెరిగిందన్నారు. అలాగే బీజేపీ పార్టీ మీద నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియచేశారు. భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై పోరాడి ప్రజల సమస్యలను నెరవేర్చే విధంగా పనిచేస్తామని తెలిపారు. అలాగే రానున్న పరిషత్ మరియు మున్సిపల్ ఎన్నికల్లో అత్యధికంగా భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం భారతీయ జనతా తరపున గెలిచిన సర్పంచ్, వార్డు మెంబర్లను సన్మానించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు, నర్సంపేట నియోజకవర్గ నాయకులు, నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, అన్ని మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# యూరియా బుకింగ్ యాప్ పై రైతులకు సూచన

**అక్షరకలం నాంపల్లి**

మీ మొబైల్ నంబర్ను ఉపయోగించి (రైతు/పౌరులు) యూరియా బుకింగ్ అప్లికేషన్లో సులభంగా లాగిన్ అవ్వవచ్చు. జిల్లాలోని రిటైలర్ల వారీగా అందుబాటులో ఉన్న యూరియా బ్యాగుల ప్రస్తుత స్టాకు ఎవరైనా తనిఖీ చేయవచ్చు.



యూరియా బుకింగ్ను పూర్తి చేయడానికి పట్టా భూయజమానులు, ఆర్ఓఎఫ్ఓ పట్టాదారులు, నాన్-పట్టా/ ఎన్ డి సి రైతులు మరియు కౌలుదారులు మాత్రమే అర్హులు. మీ గుర్తింపును నిర్ధారించడానికి మరియు బుకింగ్ను సురక్షితం చేయడానికి, మీ పి పి బి (పట్టా పాస్ బుక్) తో లింక్ చేయబడిన మొబైల్ నంబర్కు ఒక వన్-టైమ్ పాస్వర్డ్ (ఓటీపీ ) పంపబడుతుంది. రిటైలర్లు నివేదించిన రియల్ టైమ్ స్టాక్ లభ్యత ఆధారంగా రైతులు యూరియా బ్యాగులను బుక్ చేసుకోవచ్చు. మీ బుకింగ్ విజయవంతంగా పూర్తయిన తర్వాత, మీ రిఫరెన్స్ కోసం ఒక ప్రత్యేకమైన బుకింగ్ ఐడి రూపొందించబడుతుంది. మీ భూమిలో నమోదు చేయబడిన సాగు విస్తీర్ణం ఆధారంగా బుక్ చేసుకోవడానికి అందుబాటులో ఉన్న యూరియా బ్యాగుల సంఖ్య స్వయంచాలకంగా నిర్ణయించబడుతుంది. పంపిణీని సమర్ధవంతంగా నిర్వహించడానికి, మీ సాగు విస్తీర్ణం ప్రకారం బుకింగ్లు నిర్దిష్ట విరామాలలో బహుళ విడతలుగా (స్పెల్స్) విభజించబడ్డాయి:ఎ ) 0 నుండి 1 ఎకరం: 1 స్పెల్బి ) 1 నుండి 5 ఎకరాలు: 2 స్పెల్స్ (రెండు స్పెల్స్ మధ్య 15 రోజుల వ్యవధి)సి ) 5 నుండి 20 ఎకరాలు: 3 స్పెల్స్ (రెండు స్పెల్స్ మధ్య 15 రోజుల వ్యవధి)డి )20 ఎకరాల కంటే ఎక్కువ: 4 స్పెల్స్ (రెండు స్పెల్స్ మధ్య 15 రోజుల వ్యవధి)జిల్లాలోని ఏదైనా అధీకృత రిటైలర్ లేదా పిఎసిఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం) నుండి బుక్ చేసుకున్న యూరియాను కొనుగోలు చేసే సౌలభ్యం మీకు ఉంది. మీరు మీ మొత్తం బుకింగ్ పరిమాణాన్ని వివిధ రిటైలర్ల నుండి పొందవచ్చు (ఉదాహరణకు, 1 ఎకరానికి 3 బ్యాగులు కేటాయించినట్లయితే, మీరు మూడు వేర్వేరు రిటైలర్ల నుండి 3 బ్యాగులు కొనుగోలు చేయవచ్చు). దయచేసి గమనించండి, సాగు ట్యాబ్లో భూమి విస్తీర్ణం నమోదు చేసిన తర్వాత దానిని మార్చడానికి వీలు లేదు. బుకింగ్ కేవలం 24 గంటలు మాత్రమే యాక్టివ్గా ఉంటుంది. ఆ తర్వాత, ఉపయోగించకపోతే స్టాక్ను తిరిగి సిస్టమ్ లోకి విడుదల చేయడానికి బుకింగ్ ఆటోమేటిక్గా గడువు ముగుస్తుంది. అని తెలియజేశారు.

# ఎమ్మెల్యేను కలిసిన లింగంపల్లి సర్పంచ్



**సంగారెడ్డి ప్రతినిధి, అక్షర కలం..**

మునిపల్లి మండలం లింగంపల్లి సర్పంచ్ ఇర్ఫాన్ పటేల్ సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అయనకు ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి, పుష్ప గుచ్చంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటు, వారి ఇబ్బందులు, సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఆర్. వెంకటేశ్వర్లు ,జీవి శ్రీనివాస్, విఠల్, మసుధ్, ముజీప్, మాజీ వైస్ ఎంపీపీ బాబా పటేల్ ,గ్రామ శాఖ అధ్యక్షులు ఆఫ్సార్, సంపత్, ఉన్నారు.

# 108 అంబులెన్స్ వాహనాన్ని తనిఖీ చేసిన ప్రోగ్రాం కోఆర్డినేటర్



**అక్షర కలం, ఆమనగల్లు :**

ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం 108 వాహనాన్ని పోగ్రామ్ కోఆర్డినేటర్ రాజబాబు అకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న మందులు వాహనంలో ఉన్న మందులు, పరికరాల తీరును పరిశీలించారు. అనంతరం ఈఎంటీ కళ్యాణ్, పైలట్ చంద్రశేఖర్ ను వాహనం సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాద బాధితులు, రోగులను సకాలంలో ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని రాజబాబు సూచించారు.

# సంక్షేమ పథకాల అమలు తీరును చూసే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారు

**సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

హైదరాబాద్: డిసెంబర్ 19,( అక్షర కలం న్యూస్):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, సంక్షేమ పథకాలు అమలుపరుస్తున్న తీరును గుర్తించే గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు నిదర్శనమని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అంశం, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల



విజయంపై,మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య తో కలిసి మాట్లాడారు. జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు మెజారిటీ స్థాయిలో విజయం సాధించి తమ ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టారని అన్నారు. గత దశాబ్ద కాలంలో నేనే రాజు, నేనే మంత్రి అన్నట్టుగా టిఆర్ఎస్ అగ్ర నాయకులు వ్యవహరించి, రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి ప్రజలపై ఆర్థిక భారం మోపి, పైగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీరుపై విమర్శల వర్షం గుప్పిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ ప్రజలు అవేవీ పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు హామీల్లో నాలుగు ప్రధానమైన అంశాలను అమలు చేస్తూ గ్రామాలను అభివృద్ధి చేసే దిశలో ముందుకు వెళ్లేందుకే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు తమ పనితీరును ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వ్యవహరిస్తున్న తీరుపై ఆదరించి విజయం కట్టబెట్టారన్నారు.

# పెద్ద చెరువు కట్ట వెడల్పు, సుందరీకరణ ఆధునీకరణకు రంగం సిద్ధం

## పెద్ద చెరువుకు నీళ్ళు వచ్చే ఫీడర్ ఛానల్,

## నీళ్ళు వెళ్లే కాలువల ఆధునీకరణ

## వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జగ్గారెడ్డి సమక్షం లో అధికారులను ఆదేశించిన నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..**



కొండాపూర్ మండలం మల్కాపూర్ చెరువు కట్ట సుందరీకరణ వెడల్పు ఆధునీకరణకు ప్రతిపాదనలు సిద్ధాంతం చేయాలని అధికారులను మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశించారు. 1) మేకవనంపల్లి కత్వా నుండి మల్కపూర్ చెరువు వరకు 15 కిలోమీటర్ల మేర ఫీడర్ ఛానల్ అభివృద్ధి 2) మల్కాపూర్ పెద్ద చెరువు నుండి నీళ్ళు వెళ్లే కలబ్ గూర్ గ్రామం లోని నాగుల కుంట,మొగుళ్ళ కుంట ,గొల్ల కుంట, పులువాని కుంట, పెద్ద చెరువు వరకు 9 కిలో మీటర్ల మేర కాలువ ఆధునీకరణ3) మల్కపూర్ పెద్ద చెరువు నుండి నాలుగు కిలోమీటర్ల మేర ఆయకట్టుకు వెళ్లే పంట కాలువల ఆధునీకరణ4) స్టేట్ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్ సలహాల ప్రకారం మల్కాపూర్ పెద్ద చెరువు కట్ట ను బలోపేతం చేయడం, కట్ట వెడల్పు, సుందరీకరణ ఆధునీకరణ పనులు.... సంగారెడ్డి నియోజకవర్గం లోనే మల్కా పూర్ చెరువు విస్తీర్ణం లో అతి పెద్దది. 2600 ఎకరాల ఆయకట్టు కలిగి ఉన్న ఈ పెద్ద చెరువు దశాబ్దానికి పైగా మరమ్మత్తులకు నోచుకోలేదు. దీని నిలువ సామర్థ్యం 0.8టీఎంసీ లు. సంగారెడ్డి నియోజకవర్గం లోని ఆరు చెరువులకు పెద్ద చెరువే ఆధారం. దీనిని ఆధునీకరించడం వల్ల దీని కింద ఉన్న చెరువులను పూర్తిగా నింపడం, ఆయకట్టు విస్తీర్ణం పెంచడానికి అవకాశం ఉంటుంది. దీనితో పాటు మల్కాపూర్ పెద్ద చెరువు లో నీళ్ళ నిండుగా ఉంటేనే సంగారెడ్డి పట్టణం లో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటాయి. సుందరీకరణ పూర్తయితే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది.

# ముందస్తు అప్రమత్తతతో ప్రాణ నష్టాన్ని నివారించవచ్చు

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**



ముందస్తు అప్రమత్తత తో విపత్తుల సమయంలో ప్రాణ నష్టాన్ని నివారించవచ్చునని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం, ప్రకృతి విపత్తుల




నిర్వహణకు సంబంధించి మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమ నిర్వహణ, వైపరీత్యాల నివారణ నిర్వహణ చర్యలపై సిఎస్ రామకృష్ణ రావు, జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ) అధికారులతో కలిసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో హైద్రాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 22 న విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ ను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ లను ఆయన ఆదేశించారు. ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్కర సమయాల్లో ప్రాణ నష్టాన్ని నివారించడంతోపాటు, ఆస్తి నష్టాలు తగ్గించగలుతామని చెప్పారు. పరిస్థితులను అంచనా వేయగలిగితే నష్టాలను తగ్గించగలుగుతామని వివరించారు. వైపరీత్యాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని అన్నారు. ఇందుకోసం అవసరమైన అన్ని సాధనాలు వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. వైపరీత్యాల సమయంలో ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. విపత్తుల సమయంలో సుమారు 35 శాఖలు సమన్వయంతో మెలగాలని తెలిపారు. వర్షపాతం, ప్రాజెక్టుల నీటిమట్టం, నీటి విడుదల, వంతెనలు, రోడ్ల స్థితి వంటి అంశాల రియల్ టైమ్ సమాచారం ప్రజలకు చేరవేయాలని చెప్పారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అవసరమయ్యే అన్ని సేవల టోల్ ఫ్రీ నంబర్ల సమాచారం ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, వైద్య సేవలు అనేవి వైపరీత్యాల సమయంలో అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్రంలోని ఎస్డిఆర్ఎఫ్ బృందాలకు ఎన్డిఆర్ఎఫ్ బృందాలు సహకారం అందిస్తాయని తెలిపారు. అవసరమైతే అత్యవసర సమయాల్లో హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవచ్చని అన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ అధికారులు విపత్తు నివారణ చర్యలపై పలు అంశాలను కూలంకషంగా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, ఏఎస్పి రమేష్, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి సందీప్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఖమ్మం జిల్లా టీ డబ్ల్యూజేఎఫ్ మహాసభ

## హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల

## విజయవంతం చేయాలని నాయకుల పిలుపు..

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా మహాసభ డిసెంబర్ 20, శనివారం ఖమ్మం నగరంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ లో నిర్వహిస్తున్నట్లు టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బట్టిపాటి రాజశేఖర్, అడ్ హాక్ కమిటీ సభ్యుడు సయ్యద్ ఖదీర్, జిల్లా సెక్రటరీ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహాసభకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ , సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు హాజరవుతున్నారని తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద జర్నలిస్టుల ర్యాలీని ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జెండా ఊపి ప్రారంభిస్తారు. జెడ్పీ సెంటర్ వద్ద అంబేద్కర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం శ్రీ శ్రీ చౌరస్తా లో శ్రీ శ్రీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తారు. ఉదయం 10గంటలకు తెలంగాణ రాష్ట్ర గేయాలాపనతో మహాసభ ప్రారంభమవుతుందని చెప్పారు. వృత్తి రీత్యా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లు, ఇతర సమస్యలు వి పరిష్కార మార్గాలపై మహాసభ లో చర్చిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు మహాసభకు హాజరై విజయవంతం చేయాలని టి డబ్ల్యు జె ఎఫ్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశం లో యూనియన్ నాయకులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దువ్వ సాగర్, కూరాకుల గోపి, షేక్ జానీ పాషా, ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవి కిరణ్, కొత్త యాకేష్, కేదాసి కిరణ్, మధుశ్రీ, భారతి, గణేష్, అర్షద్, పాషా ఫయాస్, శరత్, రవి కుమార్, హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సరస్వతి పుత్రికపై హరీష్ కటాక్షం

## మరో గొప్ప మానవతా ఔదార్యాన్ని చాటి చెప్పిన హరీష్ రావు



**అక్షరం కలం, సిద్దిపేట్ డిసెంబర్ 19 :**

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మరోసారి తన మానవతా ఔదార్యాన్ని చాటిచెప్పారు. ఆపదలో ఉన్నారంటే ఆగమేఘాల మీద స్పందించే హరీశ్ రావు తాజాగా ఓ నిరుపేద వైద్యవిద్యార్థిని భవిష్యత్తుకు చేయూత అందించారు. ఆ విద్యార్థినికి బ్యాంకు రుణం దక్కడానికి ఏకంగా తన సొంత ఇంటినే తనఖా పెట్టి పెద్దమనసు చాటుకున్నారు. సిద్దిపేటకు చెందిన కొంక రామచంద్రం టైలరింగ్ వృత్తి చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన పెద్ద కుమార్తె మమత విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఉచితంగా ఎంబీబీఎస్ సీటు సాధించి చదువు పూర్తి చేసింది. పీజీ ఎంట్రన్స్ పరీక్ష రాయగా మహబూబ్ నగర్ లోని ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలో ఆప్తమాలజీ విభాగంలో పీజీ సీటు వచ్చింది. ప్రభుత్వ కన్వీనర్ కోటాలోనే సీటు వచ్చినప్పటికీ మూడేళ్ల పాటు ప్రతి సంవత్సరం రూ. 7.50 లక్షల చొప్పున ట్యూషన్ ఫీజు చెల్లించాలి. ఈనెల 18వ తేదీ చివరి గడువు ఉంది. ఆర్థిక స్థోమత లేని రామచంద్రం అంత డబ్బు చెల్లించలేక మనోవేదనకు గురయ్యాడు. బ్యాంకులో ఎడ్యుకేషన్ లోన్ కోసం ప్రయత్నించగా ఏవైనా ఆస్తులు మార్టిగేజ్ చేస్తేనే లోన్ ఇస్తామని బ్యాంకు అధికారులు సమాధానం ఇచ్చారు. తనకు ఎలాంటి స్థిరాస్తులు లేవని చెప్పడంతో ఆ దారి కూడా మూసుకపోయింది. దీంతో గతంలో తన కూతుళ్లకు ఎంబీబీఎస్ సీట్లు వచ్చినప్పుడు హరీష్ రావు ఆర్థిక సహాయం చేసిన విషయం గుర్తుకొచ్చి మళ్లీ ఆయనే ఆదుకుంటారని భావించి ఈ విషయాన్ని చేరవేశారు. విషయం తెలవగానే వెంటనే హరీష్ రావు స్పందించి సిద్దిపేటలోని తన ఇంటిని మార్టిగేజ్ చేసి మూడేళ్లకు సరిపడా దాదాపు రూ. 20 లక్షల రూపాయల ఎడ్యుకేషన్ లోను మంజూరు చేయించారు. దీంతో ఆ డబ్బులను కళాశాలలో చెల్లించి సీటు దక్కించుకున్నారు. మొదటి సంవత్సరం హాస్టల్ కు లక్ష రూపాయలు అవుతుందని హరీష్ రావు దృష్టికి రాగ మళ్ళీ హాస్టల్ ఫిజుకు ఎలాంటి అప్పు చేయొద్దని ఆ లక్ష రూపాయలు కూడా నేనే చెల్లిస్తా అని హరీష్ రావు ఇచ్చారు. నాడు ఆటో కార్మికులకు అండగా నేడు పేద విద్యార్థిని చదువుకు చేయూతగా సిద్దిపేట నియోజకవర్గంలోని ఆటో కార్మికుల సంక్షేమం కోసం మూడేళ్ల క్రితం తన ఇంటిని మార్టిగేజ్ చేసి బ్యాంకు ద్వారా రుణం ఇప్పించారు. ఆ ఫలితంగానే సిద్దిపేట ఆటో క్రెడిట్ కో – ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు కావడమే గాకుండా వందలాది మంది ఆటో కార్మికులకు కొండంత భరోసాగా నిలిచింది. నేడు రుణం పొందిన ఆటో కార్మికులు ప్రతీ నెల పొదుపు చేస్తూ రుణం డబ్బులను వాయిదాలు లేకుండా చెల్లిస్తున్నారు. ఆపత్కాలంలో తమకు సొసైటీ ఉందని గట్టి ధీమాను హరీష్ రావు వారికి కల్పించారు. ఆయన చేసిన సహాయం వందలాదిమంది ఆటో కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపడానికి దోహద పడింది. నేడు నిరుపేద విద్యార్థిని మమతకు వైద్యవిద్యకు సంబంధించి పీజీ ఎంట్రన్స్ లో సీటు దక్కినా కనీసం ట్యూషన్ ఫీజు లేక ఆ సీటునే కోల్పోయే పరిస్థితి తలెత్తింది. విషయం తన దృష్టికి రావడంతో ఆ అమ్మాయికి బ్యాంకు రుణం అందడానికి తన స్వగృహాన్ని మరోసారి మార్టిగేజ్ చేయడానికి కూడా వెనుకాడలేదు. ఈ ప్రక్రియ శరవేగంగా జరిగేలా యూనియన్ బ్యాంకు అధికారులతో మాట్లాడుతూ సబ్ రిజిస్టర్ ద్వారా ఇంటి పత్రాలను మార్టిగేజ్ చేసి సరైన సమయానికి మమతకు ఎడ్యుకేషన్ లోన్ మంజూరు కావడంలోనూ చొరవ చూపారు.

# సిద్దిపేటలో బిఆర్ఎస్ ను లేకుండా చేస్తాం

## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

### మంత్రి వివేక్ వెంకటస్వామి

**అక్షర కలం, సిద్దిపేట్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 19 :**

సిద్దిపేటలో బిఆర్ఎస్ ను లేకుండా చేస్తానని ప్రజలు హరీష్ రావు మీద విశ్వాసం కోల్పోయారని రాష్ట్ర కార్మిక మైనింగ్ శాఖల మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి కృష్ణమూర్తితో పాటు 100 మంది యువకులు నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిద్దిపేటపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, పార్టీ అభివృద్ధిపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లతో చర్చలు జరిపినట్లు తెలిపారు. సిద్దిపేటలో అనేక నిధులు కానీ, ప్రభుత్వ పథకాల విషయంలో కానీ స్పెషల్ గా చూడాల్సిన అవసరం ఉందని వారు సూచించినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణకు కూడా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు పాదయాత్రగా తిరగాలని, సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ దిన దిన అభివృద్ధి చెందుతుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో కచ్చితంగా సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తాం అని అన్నారు. ప్రతి గడపకు మన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరించాలని ఆయన సూచించారు. రానున్న రోజుల్లో సిద్దిపేటను కాంగ్రెస్ కంచుకోట చేస్తామని,అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, అర్బన్ మండల అధ్యక్షుడు భిక్షపతి, సీనియర్ నాయకులు గంప మహేందర్, బొమ్మల యాదగిరి, కలిమోద్దీన్, దాస అంజయ్య, అంబటి మహేష్ గౌడ్,కొత్త మహిపాల్ రెడ్డి, ఎర్రమహేందర్, సత్యనారాయణ,ఉప సర్పంచ్ సంతోష్ రెడ్డితో పాటు పార్టీలో చేరిన వార్డు సభ్యులు కనకరాజు కరుణాకర్ గిరి సతీష్ కంది దుర్గారెడ్డి, పంపరి మల్లేశం, తరిగొప్పులు స్వామి, కొత్త సత్యనారాయణ, కంది ప్రభాకర్ రెడ్డి, బాలరాజ్ వెంకటేశం, మోతే రమేష్ రెడ్డి, ఆకుల మల్లేశం, శంషొద్దీన్, సోమేష్ తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచమంతా ఐక్యమత్యంగా జరుపుకునే గొప్ప పండుగ క్రిస్మస్

**అక్షర కలం నల్లగొండ**

యూనివర్సల్ చర్చి వ్యవస్థాపకుడు రెవరెండ్ ఎం రవి కుమార్, మచిలీపట్నం కు చెందిన షారాజ్యోతి గ్రేస్ పార్ల అన్నారు. గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ సందర్భంగా పట్టణంలోని శాంతినగర్ సువార్త నిలయంలో జరిగిన గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్ లో పాల్గొని కేక్ కట్ చేసి వాక్య సందేశాన్ని అందించారు. అనంతరం నల్లగొండ నియోజకవర్గంలోని వందమంది వితంతువుల కు క్రిస్మస్ కానుకగా చీరలు అందించారు. అనంతరం క్రిస్మస్ గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో యూనివర్సల్ చర్చి సంఘ పెద్దలు సిహెచ్ ప్రభాకర్,ఎం రాములు, దుబ్బా అనిల్,,నరేష్,జీవన్, విజయ్ కుమార్, సండే స్కూల్ విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు



# హోటల్ దస్పల్లా లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారుల కంపెనీలు

## డీలర్లతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం

**హైదరాబాద్: డిసెంబర్ 19,( అక్షర కలం ):**

ఎలక్ట్రిక్ వాహనాల తయారిదారులు, మరియు డీలర్ల తో రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి,జెటిసి రమేష్ ,వివిధ ఎలక్ట్రిక్ వాహనాలు కంపెనీల ప్రతినిధులు గోపాల కృష్ణ, సురేష్ రెడ్డి ,గౌతం రెడ్డి ,ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ,తెలంగాణ ప్రభుత్వం రవాణా శాఖ లో అనేక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ఢిల్లీ లాంటి పరిస్థితి హైదరాబాద్ రావద్దు అని జీవో నెంబర్ 41 కింద ఈవీ పాలసీ తీసుకురావడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 1,59,304 వాహనాలకు 806.35 కోట్ల రూపాయలు ఈవీ వాహనాల పై రాయితీ ఇవ్వడం జరిగిందని,ప్రభుత్వం 806 కోట్ల రూపాయలు టాక్స్ నష్టపోయినప్పటికీ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించడానికి తోడ్పడిందన్నారు. మేము విజన్ 2047 నాటికి జీరో ఉద్గారాలను తగ్గించడానికి తీసుకుంటున్న చర్యలు దేశానికి ఆదర్శంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ ఓఆర్ఆర్ వెలుపల పెరుగుతున్న కొత్త కాలని ల దృశ్య జీవో 263 తీసుకొచ్చింది అందులో భాగంగా 20 వేల ఎలక్ట్రిక్ త్రీ వీలర్ ఆటోలు ,10 వేల సిఎన్జీ, ఆటో లు ,10 వేల ఎల్పీజీ ఆటో లు ,25 వేల రెట్రో ఫీటెడ్ ఎలక్ట్రిక్ ఆటో లకు అనుమతి ఇచ్చిందన్నారు. నగరంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి సరిపడ ఛార్జింగ్ స్టేషన్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తుందనీ,ప్రభుత్వం తీసుకొచ్చిన ఈవీ పాలసీ నీ కంపెనీలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. జనవరి లో రోడ్ సేఫ్టీ కార్యక్రమం జరుగుతుంది దానిపై మీరు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కంపెనీలు ,డీలర్లు ఏజెన్సీలు జనవరి లో జరిగే రోడ్ సేఫ్ మంత్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. స్కూల్ చిల్డ్రన్ కి అవేర్నెస్ కలిస్తున్నామనీ, రోడ్ సేఫ్టీ గురించి రేపు జిల్లా కలెక్టర్ లతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. మీ భాగస్వామ్యం రోడ్ సేఫ్టీ పై ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలు ,డీలర్లు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. షో రూమ్ ల వద్ద ,పెట్రోల్ బంకుల వద్ద ఇతర ప్రాంతాల్లో ఛార్జింగ్ స్టేషన్ ల సంఖ్య ను పెంచాలన్నారు. నగరంలో 2800 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయనీ, ఇప్పటికే 700 బస్సులు నడుస్తున్నాయనీ, మొన్న కొత్తగా 326 కొత్త రూట్లు ఆర్టీసీ బస్సులు నడుపుతుందన్నారు. రవాణా శాఖ చెక్ పోస్టులు ఎత్తివేసి అనేక సంస్కరణలు తీసుకొచ్చామనీ ప్రమాదాలను తగ్గించడానికి ఎన్ఫోర్స్మెంట్ బలోపేతం చేశామన్నారు. పర్యావరణాన్ని కాపాడడానికి ఈవీ వెహికల్స్ వాడుతున్నారు, ఏజెన్సీలు ఎలక్ట్రిక్ అమ్మేవారు కొనే వారికి ఒక మొక్క ఇవ్వాలి ఆది నాటి చెట్టుగా మారితే కాలుష్యం తగ్గుతుందన్నారు. ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన వాహనాలు 20 శాతం ఈవీ వాహనాలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుందన్నారు. ఈవీ కంపెనీలు ప్రభుత్వానికి సహకరించాలని, పర్యావరణాన్ని కాపాడే కార్యక్రమంలో ప్రజలు ఈవి వాహనాలు ఉపయోగించేలా కంపెనీలు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు.






# ప్రజా వైద్యాన్ని నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## సిద్దిపేట బస్తి దవఖానను ఆకస్మికంగా సందర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**అక్షర కలం, సిద్దిపేట డిసెంబర్ 19 :**

సిద్దిపేట పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద గల బస్తీ దవాఖానను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానలో ఉన్న స్టాఫ్ నర్స్ తో మాట్లాడారు. గత ప్రభుత్వంలో సిద్దిపేటలో 4 చోట్ల బస్తి దవాఖానలు ఏర్పాటు చేసుకున్నామని ఒక్క కెసిఆర్ నగర్ లోని బస్తి దవాఖానలో మినహాయించి మిగతా మూడు బస్తీ దవాఖానలు కాళ్లకుంట కాలనీ, లింగారెడ్డి పల్లి, ఆర్ అండ్ బి కార్యాలయం సమీపంలో లోన్న వాటిల్లో గత 6 నెలల నుండి డాక్టర్ లు లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసశారు.డాక్టర్ లేక మెడికల్ ఆఫీసర్ రూమ్ పెచ్చులు ఊడిపోయి, డాక్టర్ కూర్చునే కుర్చీలో దుమ్ము పట్టి ఉండటం పట్ల ఇదేనా బస్తి దవాఖాన తీరని, డాక్టర్ లు లేకుండా ప్రజలకు వైద్యం ఎలా అందిస్తారన్నారు. పేద ప్రజల కోసం బస్తి దవాఖానలను ఏర్పాటు చేస్తే వాటిని సుస్తి దవాఖానలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. ఒక వైపు 6నెలలుగా డాక్టర్ రావడం లేదని మరో వైపు ఉన్న అటెండర్ కు మూడు నెలలు గా జీతాలు రావడం లేదు. ఉన్న స్టాఫ్ నర్స్ కు నవంబర్ నెల జీతం ఇప్పటికి రాలేదని సీరియస్ అయ్యారు.దవాఖాన మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. మల్టి విటమిన్, లోప్రై మెడ్ మోషన్స్ ట్యాబ్లెట్, లివో సిట్రిజన్ జలుబు ట్యాబ్లెట్, షుగర్ ట్యాబ్లెట్ మెటఫిన్ తో పాటు ఉండాల్సిన గ్లిమిఫిరైడ్ 2ఎఐ లేవని , అదేవిదంగా చిన్న పిల్లలకు సంబందించిన జింక్ సల్ఫేట్ లేవన్నారు.. డాక్టర్ వస్తా లేదు మందులు లేవు అలాంటప్పుడు ప్రజలకు వైద్య సేవలు ఎలా అందుతాయని.. పేద ప్రజలకు అందించే ప్రజా వైద్యం పట్ల నిర్లక్ష్యం విడాలని వేంటనే బస్తి దవాఖానలో వైద్యులను ఏర్పాటు చేయాలనీ సకాలంలో మందుల అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావుతో పాటు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.



# నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

## ఎన్ సీ సీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు జాన్ జాహంగీర్

**యాదాద్రిభువనగిరి అక్షరకలం**

తెలంగాణ రాష్ట్రంలోని క్రైస్తవులను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం, క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రతి చర్చికి దీపాలంకరణ కోసం 30 వేల రూపాయల నిధులు మంజూరు చేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని యాదాద్రి భువనగిరి జిల్లా నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షులు జాన్ జహంగీర్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్రైస్తవుల పవిత్ర పండుగ క్రిస్మస్ ను ఘనంగా జరుపుకొనేందుకు ప్రభుత్వ నిధుల కోసం, ఆయా చర్చిల కమిటీ రీజస్టేషన్ కు సంబందించిన పేపర్స్, అకౌంట్ పాస్ బుక్ తదితర పేపర్లు సబ్మిట్ చేయాలని కోరారని ఆయన అన్నారు. చర్చి కమిటీ రిజిస్ట్రేషన్ కాపీలు ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురైయ్యే అవకాశం ఉందని చర్చి కమిటీ ల సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. కావున ప్రభుత్వ సిబ్బందిచే సర్వే చేయించి, చర్చి ఉన్న ప్రతి చోటా ప్రభుత్వ నిధులు మంజూరు చేసి, ఆ నిధులు అన్ని చర్చిలకు అందేవిధంగా చూడాలని ఆయన కోరారు. యేసు ప్రభువు రాష్ట్ర ప్రజలందరినీ చల్లగా చూడాలని, క్రిస్మస్ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఆలేరు నియోజకవర్గ నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షులు పీటర్ బాబు, యాదగిరిగుట్ట మండలం నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు క్రీస్తు దాసు తదితరులు పాల్గొన్నారు.



# పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష..

## ఉజ్వల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్

**సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..**

సదాశివపేటలోని ఉజ్వల జూనియర్ కళాశాల యాజమాన్యం విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించాలని, ఉద్దేశంతో డిసెంబర్ 21 ఆదివారం నాడు ఉదయం 10 గంటలకు సదాశివపేటలోని ఉజ్వల జూనియర్ కళాశాల ఆవరణలో పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ కూచి శ్రీనివాస్ తెలిపారు. ఈ పరీక్షకు పదవ తరగతి విద్యార్థులు అందరూ హాజరు కావచ్చునన్నారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం అవుతున్న పదవ తరగతి విద్యార్థుల్లో ఈ ప్రతిభ పరీక్ష ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అన్నారు.




మొదటి 25 ర్యాంకర్లకు ఉజ్వల జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను ఉచితంగా అందిస్తామని, 26 ర్యాంకర్ల నుండి 50 ర్యాంకర్ల వరకు వచ్చిన విద్యార్థులకు కాలేజీ ఫీజులో 50% డిస్కౌంట్ ఉంటుందని, 51 నుండి 100 ర్యాంకులోపు వచ్చిన విద్యార్థులకు కాలేజీ ఫీజులో 25% డిస్కౌంట్ ఉంటుందని పేర్కొన్నారు. కాబట్టి సదాశివపేట పట్టణం మరియు చుట్టు పక్కల మండలంలోని పదవ తరగతి విద్యార్థులు అందరూ ఈ ప్రతిభా పరీక్షకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955